teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 132 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 6 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## వైద్యవిధాన పరిషత్లో ఉద్యోగుల విషయంలో కీలక ప్రకటన

కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, ఎంటీఎస్ వారిని కొనసాగించండి

ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ




.. వివరాలు 2లో

## గురుకులాలంటే కులం, మతం ప్రాతిపదికననే

# అపోహకు చెక్

## గురుకుల వ్యవస్థ ప్రక్షాళనకు సర్కార్ కసరత్తు

ఇండిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటుకు సన్నాహాలు

పైలెట్ ప్రాజెక్టుగా మధిరలో స్కూల్ నిర్మాణం ప్రారంభం

ఇప్పటి వరకు గురుకులాలు అంటే కులం, మతం ప్రాతిపదికన కొనసాగుతున్నాయనే అపోహ ప్రజల్లో ఉంది.ఇప్పటి వరకు గురుకులాలు అంటే కులం, మతం ప్రాతిపదికన కొనసాగుతున్నాయనే అపోహ ప్రజల్లో ఉంది. అయితే వాటన్నింటికీ చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రస్తుతం ఉన్న గురుకులం వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు కసరత్తు చేస్తున్నది.

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కులం, మతం ప్రాతిపదికన కాకుండా అందరికీ ఒకే తరహా రెసిడెన్షియల్ స్కూల్స్ ఉండాలని డిమాండ్ వస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇండిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గమైన

మిగతా 2 లో






## తుది తీర్పునకు లోబడే గ్రూప్-4 భర్తీ ఉంటుంది

### స్పష్టం చేసిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న గ్రూప్-4 నియామకాలపై తుది తీర్పునకు లోబడే నియామకాల భర్తీ ఉంటుందని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. అంతేగాక నోటిఫికేషన్ లో ట్రాన్స్జెండర్లకు రిజర్వేషన్లు కల్పించకపోవడంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో గ్రూప్- 4 నియామకాల భర్తీకి ప్రభుత్వం 2022 నవంబర్ లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ లో ట్రాన్స్జెండర్లకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించకపోవడంపై సూర్యాపేటకు చెందిన దేవత్ శ్రీను సహా మరో ముగ్గురు హైకోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటీషన్లపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఇందులో పిటిషనర్ తరపు న్యాయవాది

మిగతా 2 లో



## రాష్ట్రంలో విపత్తు అంచనాకు ఏరియల్ సర్వే నిర్వహించాలి

అమిత్ షాను కోరిన కేంద్ర మంత్రులు

రెండు బృందాలు బాధిత ప్రాంతాలలో పర్యటిస్తాం : కిషన్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఎంత మేరకు విపత్తు జరిగిందో తెలుసుకోడానికి ఏరియల్ సర్వే చేయించాలని కేంద్రమంత్రి

మిగతా 2 లో

## మూడేళ్ళలో ఏఐ గ్లోబల్ హబ్గా మారనున్న హైదరాబాద్

### ఎన్నికల డిక్లరేషన్లో చెప్పినట్టు ఏఐకి ప్రాధాన్యత ఇస్తాం

### తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

రాబోయే మూడేళ్ళలో హైదరాబాద్ ను ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) గ్లోబల్ హబ్ గా మారుస్తామన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. ఎన్నికల డిక్లరేషన్ లో చెప్పినట్టు ఏఐకి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ లో జరిగిన ఏఐ గ్లోబల్ సమ్మిట్ 2024 లో రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రేవంత్ నూతన ఏఐ సిటీ లోగోని లాంచ్ చేశారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ఏఐ రోడ్ మ్యాప్ ను ఆవిష్కరించారు. రాబోయే రెండుమూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను ఇందులో పేర్కొన్నారు. ఈ సదస్సులో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, వివిధ ఐటీ

మిగతా 2 లో



## అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన


హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ విద్యాసంస్థలకు గుడ్ న్యూస్ చెప్పారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి

మిగతా 2 లో



## పోలీసులకు ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టుల మృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గురువారం ఉదయం సుమారుగా 06.45 గంటలకు కరకగూడెం పోలీస్ స్టేషన్ కు వాయువ్య దిశలో ఐదు కిలోమీటర్ల దూరంలోని మోతే గ్రామం అటవీప్రాంతంలో సాధారణ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు బలగాలకు మరియు నిషేధిత సిపిఐ మావోయిస్టులకు ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. చట్టవిరుద్ధంగా ఆయుధాలు కలిగి



## ఆదివాసీ మహిళ కేసులో దోషులు ఎవరైనా శిక్షిస్తాం

మహిళా మంత్రిగా నాపైనే బాధ్యత ఎక్కువ: మంత్రి సీతక్క

విపక్ష నేతల విమర్శలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆటోడ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళ కేసులో దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని

మిగతా 2 లో



## కేసీఆర్, స్మితా సబర్వాల్కు మరోసారి సమన్లు జారీ

### విచారణకు హాజరుకావాలని జిల్లా కోర్టు నోటీసులు జారీ

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): మాజీ సీఎం కేసీఆర్, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 17న

మిగతా 2 లో







## జీవో 33 విషయంలో ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట

ఎంబీబీఎస్ అడ్మిషన్లకు జీవోను సమర్థించిన కోర్ట్

స్థానికతను నిర్ధారించాకే దరఖాస్తులు పరిగణలోకి తీసుకోవాలి

.. వివరాలు 2లో

# వైద్యవిధాన పరిషత్లో ఉద్యోగుల విషయంలో కీలక ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎంటీఎస్ ఉద్యోగులను మరో ఏడాదిపాటు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగంలో **945** మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన, **1,562** మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో, **93** మంది ఎంటీఎస్ విధానంలో సేవలందిస్తున్నారు. మొత్తం **2,600** మంది ఉద్యోగుల సేవలను మరో సంవత్సరం పాటు కొనసాగించేలా ఉత్తర్వులిచ్చారు. గతంలో వీరి కోసం ఇచ్చిన ఉత్తర్వులు ఈ ఏడాది మార్చి నాటికే ముగిశాయి. అప్పట్నుంచి కొనసాగింపు ఉత్తర్వుల కోసం ఉద్యోగులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి **31** వరకు వర్తించేలా తాజా ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.

# జిల్లాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### నీటి స్టోరేజీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

### అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): అన్ని జిల్లాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి స్టోరేజీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ జలసౌధలో ప్రాజెక్టులు, జలాశయాల్లో ప్రస్తుత పరిస్థితిపై ఈఎన్సీలు, చీఫ్ ఇంజినీర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వర్షాల వల్ల జరిగిన నష్టం, మరమ్మతులపై ఆరా తీశారు. ఏ సమస్య వచ్చినా పూర్తి బాధ్యత ఆ జిల్లా అధికారులదేనని, వరదలతో ఎంత నష్టం వాటిల్లిందో పూర్తి వివరాలు గురువారంమే ఇవ్వాలని ఆదేశించారు. డ్యామేజీల మరమ్మతుల కోసం షార్ట్ టైమ్ టెండర్లు పిలవాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో సామర్థ్యం మేరకు స్టోరేజీ ఉంచుకోవాలన్నారు.

# తుది తీర్పునకు లోబడే గ్రూప్-4 భర్తీ ఉంటుంది

మొదటి పేజీ తరువాయి

జాతీయ న్యాయసేవాధికార సంస్థ వర్సెస్ కేంద్రం కేసులో ట్రాన్స్జెండర్లకు ప్రత్యేక రిజర్వేషన్ల కల్పించాలని **2014** లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, అలాగే ట్రాన్స్జెండర్లకు హారిజాంటల్ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు కూడా ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. గ్రూప్- 4 నియామకాల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనందున నియమాకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం తరుపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కౌంటర్ దాఖలు చేసేందుకు **10** రోజుల సమయం కోరారు. ఇరువురి వాదనలు విన్న జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి సమయం ఇచ్చింది. అంతేగాక ప్రస్తుతం చేపట్టబోయే నియామకాల ప్రక్రియ తుది తీర్పునకు లోబడే ఉంటుందని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# రాష్ట్రంలో విపత్తు అంచనాకు ఏరియల్ సర్వే నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి

అమిత్ షాను కేంద్ర మంత్రులు కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం బృందం సర్వే చేయనుందని తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలను సందర్శించడానికి బీజేపీ ఇద్దరు నేతలతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. ఈనెల 8తేదీన రెండు బృందాలు వరద బాధిత ప్రాంతాలలో పర్యటిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో ఖమ్మం, కోదాడ ప్రాంతాల్లో సంకినేని వెంకటేశ్వరరావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పర్యటిస్తారని చెప్పారు. ఎంపీ ఈటల నేతృత్వంలో మహబూబాబాద్, ములుగు ప్రాంతాలలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, రామారావు పాటిల్ పర్యటిస్తారని వివరించారు. తెలంగాణలో ఎస్డీఆర్ఎఫ్ నిధుల వినియోగం, మంజూరుపై రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, ప్రస్తు తం మోదీ ప్రభుత్వంలోని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర హోంశాఖ మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు.

# కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్పై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్

### సెప్టెంబరు 10న తీర్పు వెలువరించనున్నట్టు వెల్లడి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుకు సంబంధించిన సీబీఐ కేసులో కేజ్రీవాల్కు ఇంకా ఊరట లభించలేదు. సీబీఐ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్పై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం సెప్టెంబరు **10**న తీర్పు వెలువరించినున్నట్టు వెల్లడించింది. లిక్కర్ స్కాం కేసుకు సంబంధించిన సీబీఐ కేసులో తన అరెస్టును సవాల్ చేయడంతో పాటు బెయిల్ కోసం అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదిస్తూ సీబీఐ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మద్యం విధానంపై కేసు నమోదు చేసిన తర్వాత రెండేళ్ల వరకు సీఎంను అరెస్టు చేయలేదని ఎప్పుడైతే ఈడీ కేసులో బెయిల్ వచ్చిందో వెంటనే సీబీఐ ఇన్స్యూరెన్స్ అరెస్టుకు పాల్పడిందన్నారు. అరెస్టుకు ముందు ఎలాంటి నోటీసులు కూడా పంపించలేదని సింఘ్వీ కోర్టుకు వివరించారు. ఈ వాదనల అనంతరం సీబీఐ తీరుపై ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. కస్టడీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేయాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని, ఆ నిబంధన ఎందుకు పాటించలేదని ప్రశ్నించింది. మరోవైపు, కేజ్రీవాల్ బెయిల్ అభ్యర్థనను సీబీఐ వ్యతిరేకించింది. ఈ కేసులో బెయిల్ కోసం ఆయన సెషన్స్ కోర్టుకు వెళ్లకుండా నేరుగా హైకోర్టుకు వెళ్లారని సుప్రీం దృష్టికి తీసుకొచ్చింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

# ఆదివాసీ మహిళ కేసులో దోషులు ఎవరైనా శిక్షిస్తాం

మొదటి పేజీ తరువాయి

మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. కాగా విపక్ష నేతల విమర్శలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఆదివాసీ ఆడబిడ్డనేనని, అలాగే మహిళా మంత్రిగా తనపై మరింత ఎక్కువ బాధ్యత ఉందని వెల్లడించారు. ఆదివాసీ ఆడబిడ్డపై దాడి జరిగిందని తెలియగానే ప్రభుత్వం వెంటనే స్పందించిందని గుర్తుచేశారు. బాధితురాలికి అండగా నిలిచామని వివరించారు. దాడి ఘటనను పక్కదారి పట్టించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. ఎవరూ అనుమానించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే నిందితుడిని అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని, దోషులకు కఠినంగా శిక్షపడేలా చేయడం తమ బాధ్యత అన్నారు. చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. తక్షణ సాయం కింద రూ. లక్ష ఇస్తే దాన్ని కూడా తప్పు పడతారా? అని మండిపడ్డారు. దాడికి మతం రంగు పులమాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, మతకొట్లాటలు జరిగేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాగా గాయపడిన ఆదివాసీ మహిళకు గాంధీ ఆస్పత్రిలో రూ. లక్ష చెక్కు అందజేసిన సీతక్క, వైద్యులను చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# గురుకులాలంటే కులం, మతం ప్రాతిపదికననే అపోహకు చెక్

మొదటి పేజీ తరువాయి

మధిరలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరుగుతున్నది. అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది.

**55 ప్రశ్నలతో క్వశ్చనేర్**

ప్రస్తుతం ఉన్న గురుకులం వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై స్టూడెంట్స్, పేరెంట్స్, విద్యావేత్తలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు ప్రభుత్వం రెడీ అయింది. ఏకపక్షంగా విధానాలు రూపొందించి, పిల్లలపై రుద్దడం వల్ల ఉపయోగం ఉండదని అభిప్రాయానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విస్తృతంగా అభిప్రాయాలు సేకరించేందుకు సిద్ధమైంది. ఇందుకు **55** ప్రశ్నలతో కూడిన క్వశ్చనేర్ను రూపొందించింది. ఫీల్డ్ నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా గురుకులాల్లో వసతులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ప్రస్తుతం రెసిడెన్షియల్ స్కూల్స్లో ఉన్న సిస్టమ్పై సమగ్రంగా అధ్యయనం చేస్తుండగా ముందుగా ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహాయ సహకారాలపై ఆరా తీస్తున్నారు.

**పావు వంతు గురుకులాలకే సొంత బిల్డింగ్స్**

రాష్ట్రవ్యాప్తంగా **1,024** గురుకులాలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, రెసిడెన్షియల్) ఉండగా, అందులో కేవలం **324** గురుకులాలకే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా స్కూల్స్ ప్రైవేటు భవంతుల్లోనే కొనసాగుతున్నాయి. అక్కడ



సరైన వసతులు లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాంతో దశలవారీగా అన్ని గురుకులాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది. ఒక్కో గురుకులం కనీసం **10** ఎకరాల విస్తీర్ణంలో నిర్మించాలని భావిస్తున్నది. అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్లో క్లాస్ రూమ్స్, లైబ్రరీ, మోడ్రన్ డైనింగ్, కిచెన్, రీడింగ్ టెబుల్స్, వాటర్ ఫిల్టర్స్ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తున్నది.

**త్వరలో పెండింగ్ రెంట్స్ క్లియర్**

ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సంబంధించి దాదాపు రూ.**70** కోట్ల వరకు అద్దె పెండింగ్లో ఉన్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది. త్వరలో వాటిని క్లియర్ చేసి, ఆ బిల్డింగ్స్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఓనర్లకు టార్గెట్ పెట్టనుంది. పిల్లల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్ల నిర్మాణం, బెడ్స్, దోమల బెడదను అరికట్టేందుకు రెగ్యులర్గా ఫాగింగ్, కిటికీలకు జాలీల ఏర్పాటుకు ఆదేశించనున్నారు. పాములు సంచరించకుండా, పరిసరాలను క్లీన్ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపనున్నారు. అలాగే సొంత బిల్డింగ్స్ ఉన్న గురుకులాల్లో సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు రంగంలోకి దిగనున్నారు. అందుకోసం నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది.

**మెస్చార్జీల పెంపు!**

ప్రస్తుతం గురుకులాల్లో చదువుతున్న ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం అందిస్తున్న మెస్ చార్జీలతో నాణ్యమైన ఫుడ్ అందించలేకపోతున్నారు. ప్రస్తుతం **5,6,7** క్లాస్ స్టూడెంట్స్కు రోజుకు రూ.**31.6** పైసలు అందిస్తుండగా **8,9,10** చదువుతున్న పిల్లలకు రూ.**36.66** పైసలు, ఇంటర్, డిగ్రీ స్టూడెంట్స్కు రూ.**50** ఖర్చు చేస్తున్నారు. ఈ చార్జీలతో టిఫిన్, లంచ్, డిన్నర్, వారంలో రెండుసార్లు నాన్ వెజ్ అందించడం కష్టంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. అందుకని త్వరలో మెస్ చార్జీలను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి పౌష్టికాహారం అందించేందుకు ఎంత మేరకు మెస్ చార్జి ఇవ్వాలనే అంశంపై ఆరా తీస్తున్నది.

# మూడేళ్లలో ఏఐ గ్లోబల్ హబ్గా మారనున్న హైదరాబాద్




మొదటి పేజీ తరువాయి

సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఏఐ నేటితరం అద్భుత ఆవిష్కరణ అని కొనియాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయన్నారు. అలాగే అవి ఆశలతో పాటు భయాన్ని తీసుకొస్తాయని వివరించారు. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరం సిద్ధంగా లేదన్నారు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశామన్నారు. నాస్కామ్ సహకారంతో ఫ్రేమ్ వర్క్ రూపకల్పన జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఐ ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో కలసి పనిచేస్తుందన్నారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దామని పిలుపునిచ్చారు.

**ఏఐకి మొదటి ప్రాధాన్యత.**

రైలు ఇంజన్, టీవీ, కెమెరాతో ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దాకా వచ్చాయని రేవంత్ తెలిపారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతూ వస్తోందన్నారు. ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే ఏఐకి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఏఐ రంగంలో పరిజ్ఞానం ఉన్న వారికి అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం.**

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఏఐలో మనం పూర్తిగా పట్టు సాధించబోతున్నామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏటా అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళ్తామన్నారు. డీప్ ఫేక్ లాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. హైదరాబాద్ లో **200** ఎకరాలు కేటాయించి ఏఐ సిటిని ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రెండు మూడేళ్లలో ఏఐ గ్లోబల్ హబ్ గా హైదరాబాద్ అవతరిస్తుందని చెప్పుకొచ్చారు. పెట్టుబడులకు ఇండియా గమ్యస్థానంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అయ్యేలా చూస్తామని చెప్పారు. రాబోయే రెండు రోజులు హెచ్ఐసీసీ వేదికగా చర్చలు, సెమినార్లు ఉంటాయన్నారు.

# జీవో 33 విషయంలో ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం జారీ చేసిన జీవో **33** విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఎంబీబీఎస్ అడ్మిషన్లకు సంబంధించిన జీవో **33**ను హైకోర్టు సమర్థించింది. పిటిషనర్ల స్థానికతను నిర్ధారించుకున్నాకే వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు విద్యార్థుల స్థానికత (జీవో **33**) పై దాఖలైన పిటిషన్ పై హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. పిటిషన్ దాఖలు చేసిన విద్యార్థులు తెలంగాణ శాశ్వత నివాసులేనా కాదా అన్నది పరిశీలించాలని హైకోర్టు సూచించింది. ఇందుకోసం ప్రస్తుతం మార్గదర్శకాలు లేనందున కొత్తగా రూపొందించుకుని వాటిని పాటించాలని కాళోజీ వర్సిటీకి హైకోర్టు ఆదేశించింది. స్థానికత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో **33**ని సవాలు చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ వల్ల తెలంగాణ విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని, ఇతర ఎవరైనా తెలంగాణలో ఇంటర్, దానికి ముందు రెండేళ్లు తెలంగాణలో చదివితే వారకి స్థానిక కోటా వర్తింపజేయండ అన్యాయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల తెలంగాణలో పుట్టి పెరిగిన వారికి నష్టం కలుగుతుందని వాదించారు. వాదనలు విన్న న్యాయస్థానం ప్రభుత్వం జారీ చేసిన జీవోను సమర్థించింది.

# అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

మొదటి పేజీ తరువాయి

ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని **27,862** విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన జీవో కూడా విడుదల చేశామని, గురువారం నుండే ఇది అమల్లోకి వస్తుందని తెలియ జేశారు. అనేక ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యుత్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నట్టు, విద్యుత్ సదుపాయం ఉన్నప్పటికీ వాటి బిల్లులు సకాలంలో చెల్లించక విద్యుత్ కట్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్టు భట్టి పేర్కొన్నారు.

# కేసీఆర్, స్మితా సబర్వాల్కు మరోసారి సమన్లు జారీ

మొదటి పేజీ తరువాయి

విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం వల్ల ప్రజా ధనానికి భారీ నష్టం వాటిల్లిందని భూపాలపల్లి వాసి రాజలింగ మూర్తి జిల్లా కోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ ను విచారించిన కోర్టు గతంలో మాజీ సీఎం కేసీఆర్ మరో ఏడుగురు మందికి నోటీసులు పంపింది. నోటీసులు అందుకున్న వారిలో మాజీ మంత్రి హరీష్ రావు తరపున లలిత రెడ్డి, సుకన్య, అడ్వకేట్లు మెమో అప్పిరియన్స్ అయ్యారు. మెగా కృష్ణారెడ్డి, రజత్ కుమార్, ఎల్ అండ్ టి ఎండి సురేష్ కుమార్ తరపున సుప్రీంకోర్టు అడ్వకేట్ అవాదాని, శ్రావణ్ రావు మెమో అప్పిరియన్స్ అయ్యారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్లు హరి రామ్, శ్రీధర్ తరపున వరంగల్ అడ్వకేట్ నరసింహారెడ్డి మెమో అప్పిరియన్స్ అయ్యారు. అయితే గురువారం కేసీఆర్, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కోర్టుకు హాజరుకాకపోవడంతో అక్టోబర్ **17**న విచారణకు హాజరు కావాలంటూ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది.


# జనవరి 1కి 18 ఏండ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి


### తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటన విడుదల


హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కీలక సూచన చేశారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జనవరి **1** నాటికి పద్దెనిమిదేళ్లు నిండే వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.సుదర్శన్ రెడ్డి కోరారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ జూలై **20**న నుండి జరుగుతోందని.. అక్టోబరు చివరి వరకు ముసాయిదా జాబితా ప్రకటించి, నవంబరులో అభ్యంతరాలను స్వీకరించి, జనవరి **6**న తుది జాబితా వెల్లడిస్తామని అన్నారు. ఏప్రిల్ **1** నుండి ఇప్పటి వరకు **8** లక్షల కొత్త అప్లికేషన్స్ వచ్చాయని పేర్కొన్నారు. ఓటరు కార్డు , ఆధార్ లింక్ దాదాపు **60%** పూర్తయ్యిందని తెలిపారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో **3,33,27,304** మంది ఓటర్లు ఉన్నట్టు కమిషనర్ తెలియ జేశారు.

# పోలీసులకు ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టుల మృతి

మొదటి పేజీ తరువాయి







ఉన్న నిషేధిత సిపిఐ మావోయిస్టులు పోలీసులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. కాల్పులను ఆపివేయాలని హెచ్చరించినా వారు ఆపకపోవడంతో ఆత్మరక్షణార్థం పోలీసులు కూడా తిరిగి కాల్పులు జరిపారు. నిషేధిత సిపిఐ మావోయిస్టుల నుండి కాల్పులు ఆగిన అనంతరం అట్టి ప్రాంతాన్ని పోలీసులు సోదా చేయడం జరిగింది. ఇట్టి సోదాలలో ఆలివ్ గ్రీన్ దుస్తులను ధరించిన **06** మృతదేహాలను గుర్తించడం జరిగింది. ఘటనా స్థలంలో లభించిన **06** మృతదేహాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

**ఘటనా స్థలం నుండి పోలీసు వారు స్వాధీనపరుచుకున్న సామాగ్రి**

AK-47 ఆయుధాలు - 02

SLR ఆయుధం - 01

.303 రైఫిల్ - 01

పిస్టల్ - 01 మరియు దాని మ్యాగ్జిన్ తో పాటు లైవ్ రౌండ్లు,కిట్ బ్యాగులు మరియు ఇతర సామాగ్రిని స్వాధీనపరుచుకోవడమైనది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# బుల్డోజర్ పాలిటిక్స్...

బుల్డోజర్ పేరు మీరు చాలాసార్లు విని ఉంటారు. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించినప్పుడల్లా బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బుల్డోజర్ ఒక శక్తివంతమైన యంత్రం. ఇది అందరికీ తెలుసు. బుల్డోజర్ 90ల పిల్లలకు కూడా ఇష్టమైన వాహనం. ఇది తవ్వకాలకు, చెత్తను తొలగించడానికి, ఆక్రమణలను తొలగించడానికి ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో బుల్డోజర్ అనే పదం బాగా ప్రాచుర్యం పొందింది. అయితే దీని అసలు పేరు మీకు తెలుసా? బుల్డోజర్ గురించి చాలా మందికి తెలియని విషయాలు ఇక్కడ తెలుసుకుందాం..ప్రస్తుతం తెలంగాణలో ఈ బుల్డోజర్ ఫీవర్ కొనసాగుతోంది. బుల్డోజర్ చర్యకు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తోంది. దీని తదుపరి విచారణ సెప్టెంబర్ 17, 2024న జరగనుంది. అయితే, ఈ బుల్డోజర్ వాహనం అసలు పేరు ఇది కాదని మీకు తెలుసా? ఇతర వాహనాలతో పోలిస్తే దీని మైలేజీని కూడా భిన్నంగా కొలుస్తారు. భారతదేశంలో అత్యధికంగా బుల్డోజర్లను విక్రయించే కంపెనీ జేసీబీ. కానీ చాలామంది బుల్‌డోజర్ అంటే జేసీబీ అని అర్థం చేసుకుంటారు. పసుపు రంగు బుల్డోజర్‌పై నలుపు రంగులో జేసీబీ బ్రాండ్ పేరు రాయడం సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది.. ఇది కాకుండా ఇతర కంపెనీలు కూడా బుల్డోజర్లను విక్రయిస్తాయి. మార్కెట్లో అనేక రకాల బుల్డోజర్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కెపాసిటీ, మైలేజీ, ధర మొదలైన వాటిలో తేడా ఉంటుంది. బుల్డోజర్ అసలు పేరు బ్యాక్‌హో లోడర్. బుల్డోజర్ లేదా బ్యాక్‌హో లోడర్ కోసం 'మైలేజ్' అనే పదాన్ని కొద్దిగా భిన్నంగా ఉపయోగిస్తారు. దేశంలో వివిధ రకాల బుల్డోజర్ యంత్రాలు పనిచేస్తాయి.మెషీన్‌లు వివిధ మోడల్‌లలో వస్తాయి.కార్లు లేదా బైక్‌ల మాదిరిగా కాకుండా వాటి మైలేజీని లీటర్‌కి కిలోమీటర్లలో లెక్కించరు. బదులుగా, బుల్డోజర్ ఒక గంటలో ఉపయోగించే డీజిల్ మొత్తాన్ని కొలుస్తారు. బుల్‌డోజర్‌కి మైలేజ్ ఎంత అనేది అది గంటసేపు నడిచినప్పుడు ఉపయోగించే డీజిల్ మొత్తాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. బుల్‌డోజర్ జస్టిస్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిందితుడు అయినంత మాత్రాన ఇల్లు కూల్చివేయాలా అని కేంద్రాన్ని ప్రశ్నించింది. బుల్‌డోజర్ న్యాయాన్ని నిలదీస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వకేట్ దుశ్యంత్ దావే వాదించారు. దేశవ్యాప్తంగా ఈ బుల్‌డోజర్ న్యాయాన్ని అమలు చేయాలని చూస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ న్యాయాన్ని తప్పుబట్టింది. నేరం చేసినంత మాత్రాన ఆ వ్యక్తి ఆస్తుల్ని ధ్వంసం చేయడం సరికాదని తేల్చి చెప్పింది. ఆ ఇంటి నిర్మాణం అక్రమం అని తేలినప్పుడే ధ్వంసం చేయాలని స్పష్టం చేసింది. దీనిపై కచ్చితంగా కొన్ని మార్గదర్శకాలు జారీ చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలు అని తేలినప్పుడు ముందు నోటీసులు ఇవ్వాలని, వాళ్లు స్పందించని పరిస్థితుల్లో చట్టానికి లోబడి ధ్వంసం చేయాలని తేల్చి చెప్పింది. "ఇళ్లు కూల్చివేయాలంటే అంత కన్నా ముందు కచ్చితంగా కొన్ని మార్గదర్శకాలు పాటించాలి. కేవలం ఓ నేరం చేసినంత మాత్రాన ఇల్లు కూల్చేస్తారా. ఒకవేళ అది అక్రమ నిర్మాణం అని తేలితే పరవాలేదు. కానీ కేవలం నిందితుడు అన్న కారణానికి ఇల్లు కూల్చివేస్తామనడం మాత్రం సరికాదు. ఈ విషయంలో కచ్చితంగా ఓ విధానాన్ని అనుసరించాలి. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘిస్తేనే కూల్చివేస్తున్నామని మీరు చెబుతున్నారు. అయితే...అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తప్పకుండా ఉండాలి"– సుప్రీంకోర్టు ధర్మాసనం . పిటీషనర్ల తరఫున అడ్వకేట్ దుశ్యంత్ దావే, సీయూ సింగ్ కోర్టులో తమ వాదనలు వినిపించారు. ఢిల్లీలోని జహంగీర్‌పురిలో చేపట్టిన కూల్చివేతల గురించి ప్రస్తావించారు. 50,60 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లనూ కూల్చివేస్తున్నారని చెప్పారు. కొన్ని కేసులనూ ఈ సందర్భంగా ఉటంకించారు. ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఓ ఘటన జరిగింది. ఓ విద్యార్థి తోటి విద్యార్థిని కత్తితో పొడిచాడు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వెంటనే అధికారులు ఆ నిందితుడి ఇల్లు కూల్చి వేశారు. దీనిపైనే అడ్వకేట్స్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "కొడుకు తప్పు చేస్తే తండ్రి కట్టుకున్న ఇల్లుని కూల్చివేయడమేంటి" అని ప్రశ్నించారు. ఇది సరికాదని స్పష్టం చేశారు. నేరస్థులు అని నిర్ధరణ అయినప్పటికీ ఇళ్లు కూల్చివేసే హక్కు లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ బుల్‌డోజర్ జస్టిస్‌పై ఎన్నో వివాదాలు కొనసాగుతున్నాయి. ఇదేం న్యాయం అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్దతునిచ్చే వాళ్లు ఉన్నప్పటికీ అదే స్థాయిలో వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. మరో వైపుమాజ్ వాదీ పార్టీ 2017లో అధికారంలోకి వస్తే అన్ని బుల్డోజర్లను గోరఖ్‌పూర్ వైపు నడిపిస్తామని అఖిలేష్ యాదవ్ మంగళవారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ కావడంతో ఈ వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. అఖిలేష్ హెచ్చరికలను యోగి ఆదిత్యనాథ్ బుధవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో తిప్పికొట్టారు. బుల్డోజర్ నడపడానికి ధైర్యం, తెలివితేటలు, దృఢ సంకల్పం ఉండాలని, ఆ లక్షణాలేవీ యాదవ్‌లో లేవని అన్నారు. "అందరి చేతులు బుల్డోజర్ నడపడానికి పనికి రావు. దానికి ధైర్యం, తెలివితేటలు ఉండాలి. సమర్ధత, దృఢ సంకల్పం ఉన్నవాళ్లే బుల్డోజర్ నడపగలరు. అల్లర్లు సృష్టించేవారి ముందు మోకరిల్లేవారు బుల్డోజర్ ముందు నిలవలేరు" అని కౌంటర్ ఇచ్చారు.అఖిలేష్ యాదవ్‌ను 'టిప్పు' అనే నిక్‌నేమ్‌తో యోగి సంబోధిస్తూ, టిప్పు ఇప్పుడు సుల్తాన్ కావాలని ప్రయత్నిస్తున్నారంటూ చురకలు వేశారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు యూపీలో 'ఆటవికపాలన' ఉండేదన్నారు. అఖిలేష్ యాదవ్, ఆయన అంకుల్ శివపాల్ యాదవ్‌లు బలవంతపు వసూళ్లు చేసేవారని, ఏరియాలు పంచుకుని మనీ లూటీలకు పోటీ పడేవారని ఎద్దేవా చేశారు.

# డిగ్రీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

♦ కెయు పరిపాలన భవనం ముందు విద్యార్థుల ధర్నా



హన్మకొండ కేయు, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల విద్యార్థులు వందల సంఖ్యలో గురువారం యూనివర్సిటీని పరిపాలన భవనం ముందు నిరసన తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని అలాగే పరీక్షలు రాసిన ముప్పై రోజులలో ఫలితాలు విడుదల చేయాలనే డిమాండ్లతో కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా డిగ్రీ విద్యార్దులు ఉప్పుల శివ, శరత్,రాహుల్ శివలు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలకు ఆ యూనివర్సిటీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తుందిని అలాగే పరీక్షలు రాసిన ముప్పై రోజులలోపే ఫలితాలు వీడుదల చేస్తుంది. కానీ, కాకతీయ యూనివర్సిటీలో ఆ విధంగా జరగడం లేదని, అధికారుల నిర్లక్ష్యం వలన చాలామంది విద్యార్థులు పలు ప్రవేశ పరీక్షలకు అర్హత సాధించలేకపోతున్నారన్నారు. అలాగే సెంట్రల్ యూనివర్సిటీల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ ఫలితాలు ఆలస్యంగా ఇవ్వడంతో చాలా మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఫలితాలు లేటుగా రావడం వలన చాలా మంది విద్యార్థులు నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డిటెన్షన్ విధానం వలన చాలా మంది విద్యార్థులు డిటెండ్ అయ్యారు కావున వారు చదువులకు దూరం కాకుండా ఆయా విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థులు రిజిస్ట్రార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. విద్యార్థుల సమస్యలపై స్టాండింగ్ కమిటీలో చర్చించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అజర హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

- వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి అంటూ హాస్పిటల్ వద్ద ధర్నా
- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి తిరుపతి





హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): వైద్యుల నిర్లక్ష్యంతో మహిళా మృతికి కారణమైన అజార హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి ఆరోపిస్తూ డిమాండ్ చేశారు. హనుమకొండ, ములుగు రోడ్డులోని అజార హాస్పిటల్ లో మహిళా మృతికి కారణమైన అజర యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. హాస్పిటల్ కి వచ్చే రోగులను దోచుకోవడమే హాస్పిటల్ లక్ష్యంగా పనిచేస్తుందని, ప్రజల ప్రాణాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తూ దోచుకుంటున్నారని, విమర్శించారు. శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామానికి చెందిన చిలకల రమ సోమవారం హాస్పటల్లో అడ్మిన్ కాగా గురువారం ఉదయం అనారోగ్యంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న, హాస్పటల్లో వైద్యులు లేకపోవడం వల్లే మృతి చెందిందని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు కోల్పోయిందని తిరుపతి ఆరోపించారు. గతంలో అనేక సంఘటనలు ఇలాంటివి జరిగినా, ప్రభుత్వము, జిల్లా వైద్యాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని, హాస్పటల్ యాజమాన్యానికి మనుషుల ప్రాణాలు అంటే లెక్క లేకుండా పోయిందని, వైద్యం పేరుతో కనీస నిబంధనలు పాటించకుండా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్న అజార హస్పటల్ పై చర్యలు తీసుకోవాలని, మహిళా మృతి పై విచారణ చేపట్టి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓ. చిరంజీవి నాయకులు రాజేందర్, కుమార్, రాజేష్, మహేష్, ప్రశాంత్, ప్రవీన్, ప్రజా సంఘాల నాయకులు చిలుకల కొమరయ్య, బంధువులు పాల్గొన్నారు.

# ఎల్‌ఎండీ రిజర్వాయర్‌కు భారీ వరద

- 17 టీఎంసీలు దాటిన నీటి నిల్వ
- ఏ క్షణమైనా గేట్లు తెరిచే అవకాశం..
- నిజాంసాగర్ గేట్లు ఎత్తివేత



తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ) జలకళను సంతరించు కుంది. మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టు ప్రధాన వనరులైన మోయతుమ్మెద వాగు, మిడ్ మానేరు, మూలవాగులతో పాటు పలు ప్రాజెక్టుల నుంచి వరద నీరు వచ్చి చేరడంతో రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. ఎల్‌ఎండీ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 24.030 టీఎంసీలు కాగా.. 15రోజుల కిందటి వరకు ఐదు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రానికి వర్షం ద్వారా 33,832 క్యూసెక్కుల నీరు, మిడ్ మానేరు నుంచి 3300 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తోంది. రిజర్వాయర్‌లోకి భారీగా వర్షం నీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు ఏ క్షణమైనా ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని ప్రకటన జారీ చేశారు. ఇప్పటికే దిగువ ప్రాంతాల వారికి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం సాయంత్రానికి కూడా ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో అలాగే కొనసాగితే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా ప్రాజెక్టులో నీటి నిలువ 22 టీఎంసీలకు చేరితేనే నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

నిజాంసాగర్.. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్ నీటితో నిండింది. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు వస్తుండంతో ప్రాజెక్ట్ వద్ద జలకళ సంతరించుకుంది. కొన్ని సంవత్సరాల అనంతరం నిజాంసాగర్ నిండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి 26వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా గేట్లు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులకుగాను ప్రస్తుతం 1404 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్ల కొరత లేదు

♦ రోగులకు సరిపోను బెడ్ల ఏర్పాటు
♦ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం
♦ జిల్లా ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ జగదీశ్వర్



ములుగు జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ఏరియా ఆసుపత్రిలో రోగులకు సరిపోను బెడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, వైద్య సేవల కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. ఆస్పత్రిలో బెడ్ల కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్త కథనాలకు వివరణ, నిత్యం ప్రతిరోజు వందలాది మంది వ్యాధిగ్రస్తులు ఆసుపత్రికి వస్తున్న తరుణంలో వారి వెంట వారి కుటుంబ సభ్యులువస్తున్నారని, ఈ క్రమంలో బెడ్ల పై రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సమయంలో వారి వెంట వచ్చిన వారు సైతం బెడ్ల పైన సేద తీరుతున్నారని దీనిని కొందరు వేరే విధంగా భావించి రోగులకు సరిపడా బెడ్లు లేవని ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర పంచాయితిరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనదరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. గార్ల ఆదేశాల మేరకు సీజన్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని అదనపు బెడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ విషయంలో ఎవరు ఆందోళన చెందవద్దని జగదీశ్వర్ కోరారు. జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు, సరిపడ మందులు అందించడానికి ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని, శాస్త్ర చికిత్సలు నిర్వహించడానికి కూడా ఏర్పాటు చేశామని అన్నారు. దీంతో అత్యవసర రోగులను వరంగల్ జిల్లా కేంద్రానికి తరలించడం తగ్గిపోయిందని, ప్రత్యేక వైద్య నిపుణుల వైద్య సేవలను జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కృష్ణారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



- పాడే మోసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి కేశం నాగరాజ్ గౌడ్

ఆత్మకూర్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు గవినోల్ల మధుసూదన్ రెడ్డి తండ్రి గవినోల్ల కృష్ణారెడ్డి గురువారం రోజు చనిపోయారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి,మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, టిపిసిసి కల్లుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. అనంతరం అంత్యక్రియలో పాల్గొని కృష్ణారెడ్డి పాడెను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కేశం నాగరాజు గౌడ్ మోశారు. అంత్యక్రియలో అంత్యక్రియలో కార్యకర్తల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



♦ విశ్వభారతి హై స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆత్మకూర్, సెప్టెంబర్ 05 ( తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక విశ్వభారతి హై స్కూల్లో నేడు ఉపాధ్యాయ దినోత్సవం అని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది ఉపధ్యాయ దినోత్సవముతో పాటు స్వయం పరిపాలన దినోత్సవం కూడా జరుపుకోవడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులై ఉపాధ్యాయుల యొక్క గొప్పతనం గురించి కొనియాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డీఈవో భోజేష్, ప్రిన్సిపాల్ సమిత ఉపాధ్యాయులు మరియు పిటిలు పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ బాలరాజు, కరస్పాండెంట్ చంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయ వృత్తి గురించి ఉపాధ్యాయుడు సమాజంలో మెలిగే పాత్ర గురించి చక్కగా విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి.అనివాస్, జి.చరణ్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల యాజమాన్యం తరఫున అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు.ఇటి కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య కరస్పాండెంట్ బాలరాజు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# శ్రీవాణి హై స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ఆత్మకూర్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని స్థానిక శ్రీవాణి హైస్కూల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్, లత, అభిలాష ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పాటల పోటీలు ఉపన్యాస పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇట్టి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ డైరెక్టర్ డీజే విశ్వేశ్వర్, ఉపాధ్యాయులు రాఘవేంద్ర గౌడ్, గంగాధర్, వెంకటేష్ గౌడ్, రాజశేఖర్, సుభాష్, సునీత, నంద, చైతన్య, ఆస్మా శిరీష తదితరులు పాల్గొన్నారు.

# నేడు ములుగు ఎక్సైజ్ స్టేషన్లో పట్టుబడ్డ వాహనాల వేలం

ములుగు, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ములుగు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకోబడిన వాహనాలను శుక్రవారం అనగా సెప్టెంబర్ 06న ఉన్నది ఉన్నట్లుగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో ఉదయం 11 గంటలకు వేలం వేయబడునున్నట్లు ములుగు ఎక్సైజ్ సిఐ ఒక ప్రకటనలో తెలియచేశారు. ఆసక్తి గలవారు 10 శాతం ధరావత సొమ్మును చెల్లించి వేలంలో పాల్గొనవలెను. వేలంలో వాహన పొందిన వారు తగిన జీఎస్టీ సొమ్మును చెల్లించవలసి ఉంటుందని సూచించారు. వేలంలో వాహన పొందిన వారు అదే రోజు పూర్తి సొమ్మును చెల్లించవలసి ఉంటుంది. లేనియెడల అట్టి సొమ్ములను జప్తు చేసి తిరిగి వేలంపాట నిర్వహించబడునని అన్నారు.

# పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

■ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో

మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గురువారం సాయంత్రం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో వినాయక చవితి పండగ పురస్కరించుకుని ప్రజలకు మట్టి ప్రతిమలను వినియోగించి కాలుష్య నియంత్రణకు సహకరించాలని ఆయన కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం కార్యక్రమం పై పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు రసాయనాల ఉన్న ప్రతిమలతో జల వనరులు జీవరాశులు కాలుష్యానికి గురై కలుషితం అవుతాయని అన్నారు. కాలుష్య నియంత్రణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూధన రాజు, కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజనీర్ సుభాష్, మున్సిపల్ కమిషనర్లు నరేష్ రెడ్డి శాంత కుమార్, డి పి ఆర్ ఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# వైద్యుల అందుబాటు షెడ్యూల్ ఆసుపత్రిలో ప్రదర్శింపచేయాలి

## జ్వరాలు ప్రబలే గ్రామాలలో ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలి

## సమయపాలన పాటించాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): విధుల నిర్వహణలో భాగంగా వైద్యుల షెడ్యూల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగుల వివరాలు ఆన్లైన్ లో నమోదును పరిశీలించారు. ఆసుపత్రి మొత్తం పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ, చిన్న పిల్లలు, ప్రసూతి వార్డులను పరిశీలించి వైద్య చికిత్సలు పొందుతున్న ప్రజలను ఎలాంటి వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేపాక గ్రామానికి చెందిన కె లక్ష్మి నారాయణ ఆసుపత్రికి ఎముకలు, న్యూరో వైద్యలను నియమించాలని, ఎం ఆర్ ఐ సేవలు అందుబాటులోకి తేవాలని కోరగా ఖాళీలు భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చికిత్స పొందుతున్న చల్లగరిక గ్రామానికి చెందిన ఎం అర్చన, 13 సంవత్సరాల బాలికను వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. డెంగీ చికిత్సకు ఆసుపత్రికి వచ్చిన ప్రథమ బాలిక అని, ప్రస్తుతానికి డెంగీ నుండి పూర్తిగా కోలుకున్నదని వైద్యులు తెలుపగా ఆరోగ్యం పూర్తిగా కుదుట పడే వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. మీరు ఎక్కడి నుండి వచ్చారు. ఏం వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యసేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకుని చికిత్స పొందుతున్న ప్రజలు చెప్పిన





సమాదానానికి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రికి కావాల్సిన సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి లీకేజీని పరిశీలించిన కలెక్టర్ మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడు షిఫ్టుల్లో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. ఆగస్టు నెల్లలో 3578 మందికి ఓపి, 655 మందికి ఇన్ పేషేంట్స్ కు వైద్య సేవలు అందించారని, 122 ఏఎన్సీ, 12 ప్రసవాలు, 8 ట్యూబెక్టమి శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. ప్రసవాలు పెంచాలని, ఇందుకొరకు అశాల ద్వారా గర్భిణీ మహిళల జాభితా సేకరించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, నిర్వహణ బావుందని ఇదే విధముగా అన్ని కాలాల్లో పరిశుభ్రంగా ఉంచాలని అభినందించారు. వ్యాధులు ప్రబలే కాలమని వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాము, కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్రిమి సంహారక మందులు సేవించి బలవన్మరణానికి పాల్పడుతున్న కేసులు గురించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు ప్రబలే గ్రామాలను ట్యాగ్ చేసి ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, వైద్యులు డా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలకు నిలయంగా మారిన ప్రభుత్వ కళాశాల

పరిష్కారించాలని పిడిఎస్యు ఆధ్వర్యంలో నిరసన

– వెంటనే విద్యాశాఖ అధికారులు సమస్యలను తీర్చాలి

– పిడిఎస్యు విద్యార్థి సంఘ జిల్లా నాయకుడు మర్రి మహేష్

గీసుగొండ, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గీసుగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కారిచాలని ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మర్రి మహేష్ మాట్లాడుతు విద్యార్థులకు సరిపడా టీచర్స్ లేరని, ప్రయోగశాలలో ప్రయెగాలకు కావలిసిన లిక్విడ్స్ లేవని కాలేజీ మొదలై మూడు నెలలు కావస్తున్న ఇంతవరకు విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ ఇవ్వలేదని కాలేజీ మెయింటెనెన్స్ కి ఎలాంటి ఫండ్స్ వస్తలేదని అంతేకాకుండా ప్రభుత్వం జూనియర్ కాలేజీ లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలనీ వారు అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సతీష్, రాజులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.




# తహసిల్దార్ చేతుల మీదుగా ఆర్టిఐ యాక్ట్ సదస్సు కరపత్రాలు విడుదల

కృష్ణ, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కృష్ణ మండల కేంద్రంలోని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పంతిగి చిన్నయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30 రోజున సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తరఫున నిర్వహించబోయే సమాచార హక్కు చట్టం–2005 అవగాహన సదస్సు సంబంధించిన కరపత్రాలను కృష్ణ మండల ఎమ్మార్వో చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్వో సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి జిందప్ప, అసెంబ్లీ నాయకులునాయకులు సందకృష్ణ , మహదేవ్,భీమరాజు,కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మహిళల భద్రత కోసమే షీ టీంలు

మంథని : మహిళల భద్రత కోసమే షీ టీంలు ఏర్పాటు చేశారని షీ టీం ఇన్చార్జి ఏఎస్ఐ మల్లన్న అన్నారు. రామగుండం అడ్మిన్ డిసిపి టి. రాజు ఆదేశాల మేరకు బుధవారం మంథని లోని కాకతీయ హై స్కూల్ విద్యార్థుల కు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై, ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్చార్జి ఏఎస్ఐ మల్లన్న మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుంద న్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడ కుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.

# సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

♦ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె. ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటే గురువులు ఎంతో సంతోషపడతారని పేర్కొన్నారు. ప్రతి విజేత కూడా తన విజయానికి కారణం గురువులే అని చెబుతుంటారని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేది ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను మరింత మెరుగు పరిచే విధంగా గురువులు తోడ్పాటునందించి ఉన్నత స్థాయికి చేరడంలో కృషి చేస్తారన్నారు. కరోనా సమయంలో పిల్లలకు మొబైల్ ఫోన్లను ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థులను సమగ్ర మూర్తిమత్వంతో గురువులు తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నవారికి అభినందనలు తెలియజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయుల




సహకారం కూడా ఎంత ఉందన్నారు. రాబోయే రోజులలో కొత్త వరంగల్ ను చూడబోతున్నారని తెలిపారు. కొత్త వరంగల్ ను చూడడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా సభాధ్యక్షత వహించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే అది ఉపాధ్యాయులతోనే సాధ్యమని పేర్కొన్నారు. సమాజంలోని వివిధ వర్గాలు ఉపాధ్యాయుల పైన ఎంతో నమ్మకం కలిగి ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయు ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించే విద్యనే అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలంటే ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరాయని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని, ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్రగతి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి వివరించారు. ఉత్తమ పనితీరుతో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 31మంది ఉపాధ్యాయులను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందనలు తెలియజేశారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల విద్యార్థులు చేసిన స్వాగతం నృత్యం, పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

♦ జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

♦ కలెక్టరేట్లో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు



ములుగు జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, పాఠాలు బోధించడంతో పాటు మార్గదర్శకంగా ఉంటూ వారిలో స్ఫూర్తిని నింపాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అన్నారు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గురుపూజోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు లతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయులకు మరియు జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందించారు. విద్యార్థుల జీవితాలలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని వారికి పాఠాలు బోధించడంతోపాటు మార్గదర్శకంగా ఉంటూ వారిలో స్ఫూర్తిని నింపాలని అన్నారు. విద్యార్థులకు మంచి బోధన చేయడంతో పాటు విషయ పరిజ్ఞానం నేర్పించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి మరో పదిమందికి సహాయం చేస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విషయంలో సత్ప్రవర్తనతో ఉండాలని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఓపికతో మంచి విషయాలను నేర్పించాలని విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయులు రియల్ హీరోగా నిలిచిపోతారని అదేవిధంగా విద్యార్థులు కూడా గొప్ప స్థాయికి ఎదిగితే తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఉపాధ్యాయులు సంతోషిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ తన విద్యాభ్యాసంలో తమ ఉపాధ్యాయులతొ ఉన్న సన్నిహిత్యాన్ని వారు నింపిన స్ఫూర్తిని, ఉపాధ్యాయులను గుర్తుచేసుకొని సంతోషించారు. తాను కూడా ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని తాను చదువుకున్న పాఠశాల ప్రిన్సిపల్ అందించిన స్ఫూర్తితో ఐఏఎస్ సాధించానని విద్యార్థులకు సూచించారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థ తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి వారిని సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ అవార్డు వచ్చిన ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించినటువంటి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంనకు ఎంపికైన 15 మంది ఉపాధ్యాయులకు శాలువా, పూలమాలలతో సత్కరించి సర్టిఫికెట్ లను కలెక్టర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి పాణిని, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘల సభ్యులు, టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలు

ఆత్మకూర్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు స్మరించుకున్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంచి ప్రతిభను ఘనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ భాగ్య వర్ధన్ రెడ్డి,అధ్యాపకులు జమ్మన్న, రాఘవేంద్రరావు, సునీల్ కుమార్ రెడ్డి,ఏకే కురుమూర్తి, శ్వేత, లలితమ్మ, వీణ చైతన్య, బాలకృష్ణ, బుచ్చన్న, అనిత, విమల మరియు విద్యార్థిని విద్యార్థులు నాన్ టీచింగ్ బృందం తదితరులు పాల్గొన్నారు.




# ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో హెల్త్ క్యాంప్

**కమ్మర్ పల్లి:** మండలంలోని ఉప్లూర్ లో గురువారం భీంగల్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్, స్థానిక అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గుర అయ్యే అవకాశం ఉన్నందున ఈ హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ క్యాంపులో ఆరోగ్య సిబ్బంది 65 మందికి బిపి, షుగర్, టైఫాయిడ్, మలేరియా తదితర ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంప్ కు హాజరైన ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తున్నందున ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

# ఉప్పొంగుతున్న గోదావరి



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదారమ్మ ఉగ్రరూపాన్ని దాల్చి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ప్రమాద గంటికలను మోగిస్తూ భద్రాద్రి వాసుల గుండెల్లో అలజడిని సృష్టిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి లక్షల క్యూసెక్కుల నీరు భారీగా గోదావరిలోకి వచ్చి చేరడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి వేగంగా పెరుగుతోంది. బుధవారం సాయంత్రం 7 గంటలకు 46 అడుగులకు చేరుకొని మొదటి ప్రమాద హెచ్చరికను సైతం దాటుకొని ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు రోజులపాటు అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ అధికారుల హెచ్చరికతో భద్రాచలం వద్ద గోదావరి మరింత పెరిగే అవకాశం ఉందని స్పష్టమవుతుంది. ఇప్పటికే ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులు అన్నీ నిండుకుండలా మారి దిగువకే నీళ్లు విడుదల చేస్తుండటంతో ఈ ప్రవాహం మరింత ఉగ్రరూపాన్ని దాల్చనుంది. దాంతో భద్రాచలంలోని లోతట్టు ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రులు గడుపుతు న్నారు. ఇప్పటికే భద్రాచలం వద్ద 46 అడుగులకు చేరుకోగా మరో రెండు అడుగులు పెరిగితే రెండో ప్రమాద హెచ్చరికలు సైతం జన వనరుల శాఖ అధికారులు ప్రకటించనున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆ పరిసర ప్రాంతాలకు సందర్శకులకు అనుమతిని రద్దు చేస్తూ పోలీస్ శాఖ ఆంక్షలు విధించింది. కరకట్ట, గోదావరి బ్రిడ్జిలపై ఎటువంటి ఫొటోషూట్లు, సెల్ఫీలు గాని దిగితే చట్టపరమైన చర్యలు తప్పవని ఇప్పటికే ఏఎస్పీ అంకిత్ కుమార్ హెచ్చరించారు. జల దిగ్బంధంలోకి ముంపు మండలాలు

ఏజెన్సీతో పాటు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దాంతో పోలవరం ముంపు మండలాలైన కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు మండలం వరద ముంపునకు గురికాగా కూనవరం, వీఆర్ పురం మండలాల్లో అనేక గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని విలీన మండలాల అధికారులు తెలియజేశారు. రంపచోడ వరం నియోజకవర్గం పరిధిలోని ముంపు మండలాల్లో స్థానిక ఎమ్మెల్యే మిర్యాల శిరీష విస్తృతంగా పర్యటిస్తూ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ముంపు మండలాల ప్రజలను అవసరమైన మేరకు పునరావస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచిస్తున్నారు. చింతూరు నుంచి చట్టికుంట వెళ్లే జాతీయ రహదారి పై వరద రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మారేడుమిల్లి ఘాట్ రోడ్డును సైతం అధికారులు మూసివేశారు. మరో నాలుగు రోజులపాటు విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో విలీనం మండలాలకు వరద కష్టాలు అంతకంతకు పెరిగే అవకాశం లేకపోలేదు. 24 గంటల పాటు అధికారుల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు హెచ్చరించాయి.

# కాపాడలేకపోయిన కోట్లు...

హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ వరదలతో జన జీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేల ఇండ్లు నీట మునిగిపోవటంతో లక్షల మంది నిరాశ్రయులయ్యారు. విజయవాడ, ఖమ్మం జిల్లాల్లో అయితే పరిస్థితి ఘోరంగా ఉంది. ఇక భారీ వరదలకు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా ప్రభావితమయ్యాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలే కాదు కోటీశ్వర్లు కూడా వరద బాధితులుగా మారి రోడ్డున పడ్డారు. కోట్లు, ఖర్చు చేసి ఖరీదైన, విలాసవంతమైన విల్లాలు కొనుగోలు చేసిన వారు కూడా ఆకలితో అలమటిస్తున్నారు. ప్రకృతి ప్రకోపానికి పేద,ధనిక తేడా లేదనటానికి ఈ ఘటనే ఉదాహరణ అని పలువురు పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. గత రెండ్రోలుజు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు హైదరాబాద్ శివారు శంకర్‌పల్లి మండలం మోకీల పరిధిలోని పలు విల్లాలు నీట మునిగాయి. లా పలోమా విల్లాస్ కమ్యూనిటీలోకి భారీగా వరద నీరు పోటెత్తింది. అక్కడ సుమారు 210 విల్లాలు ఉండగా.. అవన్నీ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు విల్లాల పక్కన ఉన్నే వాగు పొంగి ప్రవహించింది. దానికి తోడు చుట్టూ కొత్తగా నిర్మించిన పలు కమ్యూనిటీ విల్లాస్‌లో నీటి వ్యవస్థలు సక్రమంగా నిర్వహించకపోవటంతో వరద నీరు విల్లాల్లోకి చేరిందిదీంతో రూ. కోట్లు విలువ చేసిన కొనుగోలు చేసిన విల్లాల్లోకి నీరు చేరింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వరద చేరటంతో ఖరీదైన సోఫాలు, ఇంటి సామగ్రి తడిసిపోయాయి. లక్షల ఖరీదైన కార్లు నీట మునిగాయి. చెరువును తలపిస్తూ కమ్యూనిటీ ప్రాంతమంతా నీటితో నిండిపోయింది. బయట పరిస్థితిని చూసిన పలువురు విల్లావాసులు లబోదిబోమని నెత్తినోరూ బాదుకుంటున్నారు. తాగటానికి మంచినీరు కూడా లేదని.. పాలు, నిత్యవసర సరుకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కోట్లు పెట్టి విల్లాలు కొనుగోలుచేసి ఇప్పుడు రోడ్డు మీద పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాలువలు, చెరువులు కబ్జా చేసి విల్లాలు నిర్మించటం వల్లే వరద పోటెత్తిందనే ఆరోపణలు వస్తున్నాయి. నాలా ప్రవాహానికి అడ్డుగా ఈ విల్లాలు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికంగా ఉన్న చెరువులలోకి వెళ్లాల్సిన వరద నీటిని దారి మళ్లించటంతోనే విల్లాలు నీట మునిగాయని అంటున్నారు. వీటిపై కూడా హైడ్రా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీంతో హైడ్రా వీటిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# జియో ట్యాగింగ్ ద్వారా పశుగణన

వరంగల్: జియో ట్యాగింగ్ ద్వారా పశు గణన కోసం ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది. ఇందు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనాభా గణన లాగే పశువుల గణన కూడా చేపట్టి గణాంకాలను ప్రభుత్వానికి నివేదించనున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి ప్రతీ గ్రామపంచాయతీలో ఎన్ని పశువులు ఉన్నాయి.. వాటి వివరాలు నమోదు చేసుకునేలా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రెండు రోజుల్లో శిక్షణ అనంతరం.. ఒకటో తేదీ నుండి గ్రామాల వారిగా పశువుల లెక్క పకడ్బందీగా తేల్చనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకమైన మార్గదర్శకాలు, విధి విధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణన చేపట్టనుండగా.. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం రెండో సారి చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పశు గణన కార్యక్రమం 21వది కావడం గమనార్హం. 2019లో జియో ట్యాగింగ్ ద్వారా చేపట్టిన పశుగణన అనంతరం.. ఆధునిక సాంకేతిక సమాచారంతో ప్రత్యేక యాప్‌లో పశువుల లెక్కపై వివరాలు నమోదు చేయనున్నారు. పశువులను లెక్కించడానికి ఈసారి మొబైల్ యాప్‌ను వినియోగించనున్నారు. ఈయాప్‌ను ఎలా నియోగించాలో, ఇంటింటికి వెళ్లి ఎలా వివరించాలోనన్న వివరాలపై ప్రత్యేకంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లక శిక్షణ ఇస్తున్నారు. రెండు మూడు రోజుల శిక్షణ అనంతరం క్షేత్రస్తాయిలో గ్రామాల వారిగా పశువుల సంఖ్య ఎంత, గతంలో కంటే గ్రామాల వారిగా ఎంత పశువులు సంతతి పెరిగింది అన్న అంశాలపై వివరాలు సేకరించనున్నారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ ఒకటి నుండి పశు గణన కార్యక్రమం చేపట్టనుండగా.. ఎన్యుమరేటర్లు యాప్‌లో నమోదు కోసం ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. ఈ మొబైల్ యాప్‌లో ఇంటి యజమాని వివరాలతో పాటు యజమానికి ఉన్న భూమి వివరాలు, పశువుల వివరాలు, పాడి పశువులు ఎన్ని, జెర్సీ, దేశీ ఆవులు, గేదెలు, గొర్రె లు, మేకలు, తదితర పాడి పరిశ్రమకు సంబంధించి వివరాలు ప్రత్యేకంగా సేకరించనున్నారు. ఆ తర్వాత వి వరాలను యాప్‌లో నమోదు చేయనున్నారు. ఆడ, మగ వివరాలతో పాటు పశువుల వయస్సు, పాలు ఇచ్చే పశువుల సంఖ్యను నమోదు చేయనున్నారు. యాప్‌లో ఉండే ప్రతీ అంశానికి సంబంధించి రైతుల నుండి సమాచారం సేకరిస్తామని.. స్థానిక పశువైద్యశాఖాధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 435 మంది ఎన్యుమరేటర్లు ఉన్నారు. వారికి మొబైల్ యాప్‌లో నమోదుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పశుగణన లెక్కించేందుకు ఎన్యుమరేటర్సే కీలకంగా మారనున్నారు. పశుసంవర్ధక శాఖలోని సిబ్బంది క్షేత్రస్థాయిలో పశువుల సంఖ్యపై లెక్క తేల్చనున్నారు. నాలుగు నెలల పాటు పశు గణన కార్యక్రమం పూర్తి చేసి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంఖ్యను చెప్పనున్నారు. జిల్లాల వారిగా విభజించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. నెలకు కనీసం వెయ్యి నుండి పదిహేను వందల వరకు ఇళ్లకు వెళ్లి పశువుల సంఖ్య వివరాలు యాప్‌లో నమోదు చేయనున్నారు. కీలకంగా భావిస్తున్న ఎన్యుమరేటర్లకు.. ఒక్కో ఇంటికి తొమ్మిది రూపాయల 50 పైసలు చొప్పున భృతి చెల్లించనున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 4500ల కుటుంబాలను అప్పగించి.. పశు గణణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని పశుసంవర్ధక శాఖలో పనిచేసే సిబ్బందికి.. బాధ్యతలు అప్పగించి ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# లివింగ్ రిలేషన్ షిప్... గర్భం వస్తే నాకు సంబంధం లేదు

## నెట్టింట్లో వైరల్ అవుతున్న కండిషన్స్

ముంబై: పెళ్లి పేరుతో తనను మోసం చేయడమే కాకుండా.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ ప్రభుత్వ ఉద్యోగిపై యువతి కేసు పెట్టింది. దీంతో ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు ప్రారంభించిన నిందితుడు.. అందుకు లాయర్‌ను సంప్రదించాడు. తాను ఆమెను మోసం చేయలేదని, ఇద్దరం లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నామని వివరించాడు. అంతేకాదు, సహజీవనం కోసం తమ మధ్య కుదిరిన ఒప్పందం బయటపెట్టిన అతడు... అందులోని ఒక కండిషన్ ప్రకారం తనపై కేసు చెల్లదని పేర్కొనడం గమనార్హం. కానీ, ఆ ఒప్పంద పత్రంపై తాను సంతకం చేయలేదని, అది ఫోర్జరీ చేశాడని సదరు యువతి వాదిస్తోంది. దీంతో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటన దేశ ఆర్థిక రాజధాని నగరం ముంబయిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వయోధికులకు సంరక్షకురాలిగా పనిచేస్తోన్న 29 ఏళ్ల యువతి..ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోన్న 46 ఏళ్ల వ్యక్తితో సహజీవనంలో ఉంది. తనను పెళ్లి చేసుకుంటానని అతడు మోసం చేశాడని, పలుమార్లు అత్యాచారం చేశాడంటూ ఆమె ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడిపై అత్యాచారం, మోసం తదితర సెక్షన్ల కింద కేసు నమోదయ్యింది. అయితే, నిందితుడు తమ మధ్య కుదిరిన ఒప్పంద పత్రాన్ని బయటపెట్టాడు. అంతేకాదు, తన తరఫున లాయర్‌ను కూడా పెట్టుకున్నాడు. ఇద్దరూ ఓ అవగాహనకు వచ్చిన ఒప్పందం కుదుర్చుకున్నారు కాబట్టి ఈ కేసు కుట్రపూరితమని అతడి తరఫున లాయర్ వాదించారు. కానీ, ఆ సంతకం తనది కాదని ఆ యువతి వాదించడం గమనార్హం. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో కుదుర్చుకున్న ఈ ఒప్పందంలో ఏడు కండిషన్లు పెట్టుకున్నారు. ఆ అగ్రిమెంట్ నిబందన ప్రకారం.. 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూన్ 30 వరకు కలిసుండాలని నిర్ణయించుకున్నారు. అలాగే, రిలేషన్‌లో ఉన్నప్పుడు పరస్పరం లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం, కేసులు పెట్టుకోవడం చేయరాదు. మూడో పాయింట్‌గా సహజీవనంలో భాగంగా అతడి ఇంట్లోనే ఆమె ఉండాలి. భాగస్వాముల్లో అవతలి వ్యక్తి వైఖరి నచ్చకపోతే నెల రోజులు ముందు నోటీసు పీరియడ్ ఇచ్చి తర్వాత విడిపోవచ్చు. ఒకవేళ, ఆమె గర్భం దాల్చితే అందుకు తాను బాధ్యుడు కాదని మరో పాయింట్లో రాసుకున్నారు. అలాగే, ఇరువురి తరఫు బంధువుల రాకపోకలపై ఆంక్షలు, మానసిక ప్రశాంతత భంగం వాటిల్లకుండా చూసుకోవడం వంటివి అగ్రిమెంట్‌లో చేర్చారు. దీని నోటరీ కూడా చేయించడం గమనార్హం. ప్రస్తుతం ఈ అగ్రిమెంట్‌పై నెట్టింట చర్చ మొదలైంది. ఈ కేసులో నిందితుడికి ట్రయల్ కోర్టు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. అలాగే, ఒప్పందంలోని వాస్తవాలను నిర్ధారించాలని, బాధితురాలు ఆరోపిస్తున్నట్టు ఆమె సంతకమేనా? కాదా? అనేది తేల్చాలని పోలసీ?లకు ఆదేశాలు జారీచేసింది. విచారణ పూర్తిచేసిన తర్వాత పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అంత వరకు నిందితుడిపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని తెలిపారు.

# తాడ్వాయి ఫారెస్ట్ విచారణ షురూ

వరంగల్: ములుగు జిల్లా తాడ్వాయి, పస్రా ఫారెస్ట్ రేంజ్ లో ఏకంగా 200 హెక్టార్లలో చెట్లు నేల మట్టం కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో ఎంతటి భారీ వర్షాలు కురిసినా అటవీ ప్రాంతాలు ప్రభావితమైన దాఖలాలు చాలా తక్కువే. కానీ ఇప్పుడు కురిసిన వర్షాలకు చిన్న, పెద్ద వృక్షాలు అన్ని కలిపి 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ ఏరియా భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. కాగా ములుగు జిల్లాలో కూడా వర్ష ప్రభావం ఉండగా.. అది ఫారెస్ట్ ఏరియాపై ఎక్కువ కనిపించింది. ఏకంగా 200 హెక్టార్లలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం అయ్యాయంటే మామూలు విషయం కాదు. అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అసలు ఫారెస్ట్ ఏరియాలో ఇంత పెద్ద ఎత్తున చెట్లు కూలిపోవడంపై విచారణకు ఆదేశించారు. ఈ మేరకు వరంగల్ సీసీఎఫ్ ప్రభాకర్, ములుగు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రాహుల్ కిషన్ జాదవ్, ఇతర అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం సాయంత్రం ఒక దఫా ఎంక్వైరీ చేసి, అక్కడి పరిస్థితిని పరిశీలించారు. చెట్లు నేలకూలిన ప్రదేశాన్నంతా కలియ తిరిగారు. ఒక్క గాలివానకే ఇంత పెద్ద నష్టం జరగడం ఇదే తొలిసారి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంగళవారం అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టగా.. బుధవారం టెక్నికల్ టీమ్ అధికారులు కూడా అటవీ ప్రాంతాన్ని సందర్శించి నివేదిక తయారు చేయనున్నట్లు తెలిసింది. అటవీ ప్రాంతం నేలమట్టం కావడంపై ఫారెస్ట్ అధికారులు శాస్త్రీయ కారణాలను అన్వేషించే పనిలో పడ్డారు. ఈ మేరకు చెట్లు కూలిపోయిన ప్రదేశంలో మట్టి శాంపిల్స్ సేకరించారు. దాదాపు మూడు మీటర్ల లోతులో నుంచి మట్టి శాంపిల్స్ తీసుకుని, వాటిని ల్యాబ్‌కు పంపి పరీక్షించే పనిలో పడ్డారు. చెట్లు నేల కూలడానికి అసలు కారణాలు ఏంటి.. అక్కడి నేల స్వభావం ఏమైనా మారిందా.. లేదా ఇందులో కుట్ర ఏమైనా దాగి ఉందా.. అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. రెండు రోజుల కిందటే మట్టి శాంపిల్స్ కు పంపించగా.. అక్కడి నుంచి వచ్చే రిపోర్ట్ ఆధారంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఒక వేళ నేల స్వభావం మారితే ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అటవీ ప్రాంత రక్షణ కోసం తగిన చర్యలు చేపట్టనున్నట్లు అటవీ శాఖ సిబ్బంది వివరించారు. వనదేవతలు సమ్మక్క-సారక్కల దయవల్లనే ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదని మంత్రి సీతక్క అన్నారు. ఈ గాలి విధ్వంసం గ్రామాల్లో జరిగి ఉంటే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఉండేదని అన్నారు. అమ్మ దయ వల్లే ప్రమాదం తప్పిందని చెప్పారు. ఆ తల్లుల దీవెనతోనే ప్రజలు సురక్షితంగా బయట పడగలిగారని అన్నారు. ఈ ఘటనపై కేంద్రం కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. కేంద్రం నుంచి పరిశోధన టీంలు రప్పించి కారణాలు గుర్తించాలన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇక పెను విధ్వసంతో చెట్లు నేలకొరగటంపై అటవీ శాఖ అధికారులు ఇప్పటికే విచారణ మె?దలు పెట్టారు. గాలులు వీచిన విధానంపై.. జరిగిన విధ్వంసంపై వారు సైంటిఫిక్ రీసెర్చ్ చేస్తున్నారు. రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహకారంతో విధ్వంసానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. త్వరలోనే ఈదురు గాలులు చోటు చేసుకోవటానికి గల కారణాలు తెలుస్తాయని అధికారులు అంటున్నారు.

# 30న చలో హైదరాబాద్

- కాంట్రాక్ట్, నాన్ పర్మినెంట్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు తీర్మానం
- చట్టబద్ధ హక్కుల కోసం నెలాఖరు వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో క్యాంపెయిన్
- కార్మిక హక్కులు కాలరాస్తున్న మోడీ సర్కార్ : పాలడుగు భాస్కర్

హైదరాబాద్: కాంట్రాక్ట్, నాన్ పర్మినెంట్ ఉద్యోగుల చట్టబద్ధ హక్కుల సాధనకు ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఈశ్వర్‌రావు అధ్యక్షతన కాంట్రాక్ట్, నాన్ పర్మినెంట్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోడీ సర్కార్ లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోకపోతే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ కనీస వేతనాలు పెంచకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లలో కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల ముట్టడి




చేపట్టాలని సదస్సు తీర్మానించింది. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేశ్ సదస్సు తీర్మానం ప్రవేశ పెట్టగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ కర్తవ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, కోశాధికారి వంగూరి రాములు, కార్యదర్శులు బి. మల్లేశ్, పద్మశ్రీ, ఎ. ముత్యంరావు, బి. మధు, జె. చంద్రశేఖర్ ,ఎం. వెంకటేష్, కూరూపాటి రమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సుధాకర్, వై. సోమన్న, ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న వాయుగండం

హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అల్పపీడన ప్రభావం కనిపిస్తోంది. చాలా ప్రాంతాల్లో వర్షాలు మళ్లీ మొదలయ్యాయి. ఇప్పటికే వరదల దెబ్బ నుంచి కోలుకోని జిల్లాల్లో కూడా వర్షాలు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రజలు, ప్రభుత్వాలు మరింత అప్రమత్తమై అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మూడు రోజులుగా కురిసిన వర్షాలకు, పొంగిన వరదలకు ప్రజలు చతికిల పడిపోయారు. ప్రభుత్వాలు ఆదుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. మొదటి అంతస్తు వరకు నీళ్లు రావడంతో చిన్నపెద్ద అనే తేడా లేకుండా అంతా రోడ్డున పడ్డారు. ఇళ్లలో బురదల మేటలు వేసి ఉంది. దాన్ని ఎలా తొలగించాలని ఆలోచనలో ఉన్న ప్రజలకు ఇప్పుడు పడుతున్న వర్షాలు షాక్‌కి గురి చేస్తున్నాయి.

బంగాళాఖాతంలో అల్పపీడనం

సెప్టెంబర్ 5న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ మొదటి నుంచి చెబుతూ వస్తోంది. ఇప్పుడు వాతావరణం అందుకు అనుగుణంగానే మారుతోంది. విజయవాడ, ఖమ్మం సహా చాలా జిల్లాల్లో వర్షావరణం ఏర్పడింది. ఈ అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణాధికారులు చెబుతున్నారు.

భారీ వర్షాలకు ఛాన్స్

పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా వాయుగుండగా మారుతుందని... దీని ప్రభావం కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని కారణంగా రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని అంటున్నారు.

తెలంగాణలో గాలి వాన

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పినట్టుగా... మధ్య విదర్భ, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రామగుండం, కళింగపట్నం, అక్కడి నుంచి ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించిందని తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వర్షాలతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది.

# భారీ వర్షాలు ,విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి

హైదరాబాద్: ప్రకృతి విలయ తాండవం చేస్తున్నప్పుడు మనమందరం జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా ఎక్కువగా విపరీతమైన వర్షాలు పడుతున్నప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోండని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్యాబినెట్ మంత్రులు ,ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ మొత్తం పునరావాస కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంది. రాజకీయం చేసే వారు రాజకీయం చేస్తుంటారు..ప్రజలకు అండగా ఉండే బాధ్యత గల ప్రభుత్వంగా మేము అన్ని రకాల కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రకృతి విపత్తును అపగలిగే శక్తి ఎవరికీ లేదు. దాని నుండి ఏవిధంగా నివారించుకోవాలి..ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ప్రభుత్వం నుండి చెప్తున్నాం. నష్టాన్ని ఏ విధంగా పూడ్చుకోవాలని ప్రయత్నం చూస్తున్నాం..కేంద్రం నుండి సహకారం కోరుతున్నాం. మనం కూడా మన బాధ్యతగా కార్యక్రమాలు నిర్వహించుకునే ప్రయత్నం చేద్దాం. ఎక్కడైనా విపత్తు వస్తె రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరికి ఆదేశాలు ఇచ్చాం. అధికారులంతా స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలి. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి సహాయ కార్యక్రమాల్లో ఉండాలని మా పార్టీ నాయకత్వాన్ని కోరినం. మేము కూడా నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నాం.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి.

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడిఒసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో కాలుష్య నియంత్రణ మండలి ఆద్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. కృత్రిమ ,రంగులు, రసాయనాలతో కూడిన విగ్రహాలు పూజించి చెరువులలో, కాలువలలో నిమజ్జనం చేయడం వలన జల వనరులు కాలుష్యానికి గురవుతున్నా యని, తద్వారా జలాల్లో నివసించే జీవరాసులు మనుగడ కష్టమవుతుం దని తెలిపారు.మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్రజలకు అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ నెల 6వ తేదిన జిల్లాలోని ప్రధాన కూడళ్ళులో 8 అంగుళాల మట్టి గణపతి లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు మట్టి విగ్రహాలను పూజించి జలాశయాలు కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్ , పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్ధ రెడ్డి, డీఈఓ రాజేందర్, బిసి, ఎస్సి సంక్షేమ అధికారులు శైలజ, సునిత, ఉద్యానవన శాకాధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి**
**-ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి**
**-విష జ్వరాలు ఉన్న గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించండి**
**-రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



మంథని : రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రజలకు సూచించారు.బుధవారం మంథని పట్టణ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరినదీ నీటి ప్రవాహాన్ని భారీ వర్షం లోనే మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు.అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు అప్రమత్తంగా ఉన్నారని,విపత్తును ఎదుర్కోవడానికి మా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రల కురుస్తున్న భారీ వర్షాలు, మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారని తెలిపారు. మంథని మునిసిపల్ ప్రాంతంలో కాలువలలో మురికినీరును, అక్కడక్కడ చెత్తాచెదారాలను వెంట వెంటనే క్లీన్ చేయాలని మున్సిపల్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు, గత ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల దోమల ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ గ్రామంలో విష జ్వరాలు వస్తే ఆ గ్రామాన్ని వెంటనే హెల్త్ క్యాంపు నిర్వహించి వారికి వైద్య సదుపాయం అందించాలన్నారు, మంథని నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్య సదుపాయాన్ని ఇవ్వాలని జిల్లా వైద్య అధికారులను మంత్రిగారు ఆదేశించారు విపత్తును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని,లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారితో ఫోన్లో మాట్లాడుతూ ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అధికారులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆ రైతులకు ధైర్యం చెప్పి స్పష్టంగా పంట నష్టం ఎంత జరిగిందో చూడాలని అధికారులను మంత్రిగారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండా శంకర్ ముస్కుల సురేందర్ రెడ్డి, అజీమ్ ఖాన్, ఆకుల కిరణ్, గుండా పాపారావు లతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పవర్ లూం క్లస్టర్ ను మంజూరు చేయండి

**- యార్న్ డిపోను ఏర్పాటు చేయండి..**
**- సబ్సిడీని 80 శాతానికి పెంచండి**
**- పావులా వడ్డీకే రుణాలందించండి**
**- కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కలిసిన బండి సంజయ్..**

హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కోరారు. దీంతోపాటు నేషనల్ హ్యాండ్లూం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు డిపో యార్న్ డిపో, ను ఏర్పాటు చేయాలని విజ&ఞప్తి చేశారు. అట్లాగే ముడిసరుకు ఖర్చుల కారణంగా నేతన్నలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని కోరారు. ఢిల్లీలో గిరిరాజ్ సింగ్ ను కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ను ఏర్పాటు చేయడంవల్ల వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా యంత్రాల ఆధునీకరణతోపాటు ఉత్పాదకతను, కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అట్లాగే యార్న్ డిపో ఏర్పాటువల్ల సిరిసిల్లో నేత కార్మికులకు ముడి సరకులు సులభంగా తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ప్రస్తుతం నేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, పెరిగిన ఖర్చులవల్ల ముడిసరకులను కూడా కొనుగోలు చేయడం కష్టమైందన్నరు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావులా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ విజ&ఞప్తిపట్ల జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. యార్న్ డిపో ఏర్పాటుతోపాటు పవర్ లూం క్లస్టర్ మంజూరుపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 80 శాతం సబ్సిడీ, పావులా వడ్డీకే రుణాలు వంటి అంశాల అమలు సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

# రామోజీ సిటీలోకి బుల్డోజర్లు వెళ్తాయా..?

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో రామోజీ ఫిలిం సిటీని 1000 నాగళ్ళతో దున్నుతానని కేసీఆర్ శపథం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు. పైగా మార్గదర్శి కేసులో జగన్ ఉరిమి వస్తుంటే.. రామోజీరావును జైలుకు వెళ్లకుండా కేసీఆర్ కాపాడారు..ఎన్ కన్వెన్షన్ సెంటర్ విషయంలోనూ నాగార్జున పై కేసీఆర్ ఇదే స్థాయిలో ఉదారత చూపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాదులో ఆక్రమణలను పడగొడుతోంది. చెరువులు, బఫర్ జోన్లలో నిర్మించిన నిర్మాణాలను కూల్చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరంలో హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. ఇప్పటికే పాలు చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను పడగొట్టింది. నిర్మాణంలో ఉన్న కట్టడాలను నేల కూల్చింది. భవిష్యత్తులోనూ చెరువులను, కుంటలు, నాలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. సాక్షాత్తు దీనిని ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో హైడ్రా దూకుడును అడ్డుకునేవారు కనిపించడం లేదు. పైగా దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరికొత్త విజ్ఞప్తులు హైడ్రా ముందుకు వస్తున్నాయి. హైదరాబాద్ నగర పరిధిలోని కబ్జాకు గురైన చెరువులు, నాయకులు నిబంధనలను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాల వివరాలను హైడ్రా దృష్టికి పలువురు తీసుకొస్తున్నారు. ఇందులో ఎక్కువగా బడా బాబులకు చెందిన నిర్మాణాలే ఉన్నాయి. అయితే వాటిపై హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకుంటున్ననేది ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో హైదరాబాద్ నగరానికి మణిహారంగా మారిన రామోజీ ఫిలిం సిటీపై తెరపైకి సరికొత్త ఆరోపణలు వస్తున్నాయి.రామోజీ ఫిలిం సిటీపై ఆరోపణలు కొత్త కాదు. అసైన్డ్ భూములు ఆక్రమించి ఫిలిం సిటీని నిర్మించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కొంతమంది పేదలకు ఆ భూములను పంపిణీ కూడా చేశారు. వీటిపై అప్పట్లో శంకర్రావు, గోనె ప్రకాష్ రావు వంటి వారు కోర్టులను ఆశ్రయించారు. రామోజీ ఫిలిం సిటీ విస్తరించిన ప్రాంతంలో చెరువులు ఉన్నాయట. రామోజీరావు నివసించిన భవనం పక్కనే అతిపెద్ద నాలా ఉందట. దానిని ఆక్రమించి భారీ నిర్మాణం చేపట్టారట. ఈ విషయాన్ని ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన ముఖాముఖిలో ఓ సామాజికవేత్త బయటపెట్టారు. తెలంగాణ హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే ఆ నిర్మాణాలను కూడా పడగొట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతమైన వ్యాప్తిలో ఉంది. ఈ వీడియో ప్రసారమవుతుండగానే రామోజీ ఫిలిం సిటీ లో ఉన్న చెరువులను చూపిస్తుండడం విశేషం. మరి దీనిపై తెలంగాణ హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది. మరోవైపు తెలంగాణ హైడ్రా చేస్తున్న పనులను ఈనాడు అభినందిస్తోంది. హైదరాబాద్ నగరాన్ని ఆక్రమణలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరుతోంది. మరి ఇదే స్ఫూర్తిని తన ఫిలిం సిటీ లోని చెరువులను పరిరక్షించేందుకు ప్రయోగించాలని కోరుతుందా? హైడ్రా తీసుకునే చర్యలకు సమ్మతం తెలుపుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది.

# దంతేవాడలో జగన్ చనిపోయినట్టేనా..?

### మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

వరంగల్: ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతిచెందారు. అయితే వీరిలో మావోయిస్టు అగ్రనేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ ఏ దాదా రణదేవ్ దాదా ఉన్నారు. కేంద్ర మిలిటరీ ఇన్చార్జ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ బార్డర్ ఇంచార్జ్ గా వ్యవహరించిన ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందినట్టు దంతేవాడ పోలీసులు ప్రకటించారు. మావోయిస్టు అగ్రనేత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవాడు కావడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. అగ్రనేత స్వగ్రామం కాజీపేట మండలం టేకులగూడెం అని, ఇటీవల జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో జగన్ కూడా చనిపోయాడని దంతేవాడ ఎస్పీ తాజాగా ప్రకటించారు.

ఛత్తీస్ గఢ్‌లో ఆపరేషన్ మావోయిస్టుల లక్ష్యంగా బలగాలు కూంబింగ్ ను కొనసాగిస్తున్నాయి. భారీ వర్షాల సమయంలో మావోయిస్టులను ప్రాంతాలు మారుతున్నారు. ఈ క్రమంలో పోలీస్ బలగాల కూంబింగ్ కొనసాగించారు. రెండు రోజుల కిందట ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతేవాడ పోలీసులు ధృవీకరించారు. ఛత్తీస్ గఢక్ రాష్ట్రంలోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం అందింది. దాంతో అప్రమత్తమైన పోలీస్ బలగాలు దంతెవాడ, బీజాపూర్ ప్రాంతంలోని అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతెవాడ పోలీసులు ధృవీకరించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొని, అనంతరం సైతం కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలు, వారిపై రివార్డ్ ఎంతంటే..

1. రణదేవ్ (మాచర్ల ఏసోబు అలియాస్ జగన్) వరంగల్ నివాసిపై రివార్డు - రూ.25 లక్షలు
2. సుశీల మడకం, భర్త జగదీష్.. రివార్డు - రూ.5 లక్షలు
3. కుమారి శాంతి, పోస్ట్- 31 ఖఒ సభ్యులు. రివార్డు - రూ.5 లక్షలు
4. కోసా మాద్వి, హోదా- మలంగిర్. ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు - రివార్డు- రూ.5 లక్షలు.
5. గంగి ముచకి, హోదా- కాటేకల్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు - రివార్డు-రూ.5 లక్షలు.
6. లలిత, పోస్ట్- సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు - రూ.5 లక్షలు.
7. కవిత, పోస్ట్ గార్డ్ ఆఫ్ యాఆజిఅగా ఉన్నారు, ఆమెపై రివార్డు - రూ.5 లక్షలు.
8. కమలేష్. ప్లాటూన్ మెంబర్- బీజాపూర్ నివాసి, రివార్డ్ - రూ. 2లక్షల
9. హిడ్మే మంకం, సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు - రూ.2 లక్షలు

# రాజకీయాల్లో సరిపోదా శనివారం...

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులు కనీవిని ఎరుగని రీతిలో వర్షాలు కురిశాయి. దీంతో రెండు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ అతలాకుతలమైంది. తెలంగాణలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. ఇద్దరు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు సమస్థితిని పునరుద్ధరించే పనిలో పడ్డారు. బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. తెలంగాణలో మృతులతోపాటు, రైతులకు సాయం ప్రకటించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ క్రమంలో ఊహించిన పరిణామంలో, నాని యొక్క సరిపోద శనివారం తెలంగాణాలో రాజకీయ చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ దీనిపై అసాధారణమైన వాదనను చేసింది. తెలంగాణ వరదలతో అతలాకుతలం అవుతుంట్టే సీఎం రేవంత్ రెడ్డి సరిపోద శనివారాన్ని చూస్తున్నారని కేసీఆర్, కేటీఆర్‌ల నమ్మకస్తుడు, బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ ఆరోపించారు.గత శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిశాయి. నదులు పొంగాయి. వరద పరిస్థితి మరింత దిగజారింది. ఈ సమయంలో తెలంగాణ సీఎం ఎక్కడ ఉన్నారు? అతను తన కుటుంబంతో కలిసి తన ఇంట్లో కూర్చుని సరిపోద శనివారం సినిమా చూస్తున్నాడు అని బాల్క సుమన్ ఆరోపించారు. తెలంగాణ వరదలు ముంచెత్తుతున్న సమయంలో ఆయన తన ఇంట్లో సినిమా చూసే పనిలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. ప్రజలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. కష్టసమయంలో అండగా ఉండాల్సిన సీఎం.. కుంటుంబంతో ఎంజాయ్ చేశాడని విమర్శించారు.ఇదిలా ఉంటే సరిపోద శనివారం గత వారాంతంలో మాత్రమే థియేటర్లలో విడుదలైంది. ఇది స్పష్టంగా ఓటీటీలోకి రాలేదు. కాబట్టి, రేవంత్ తన ఇంట్లో సినిమా చూడటం వెనుక లాజిక్ ఏంటని ఎవరైనా ఆశ్చర్యపోవచ్చు. దీని అర్థం బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ కేవలం నాని నటించిన చిత్రాన్ని ఉపయోగించి బ్లఫ్ చేస్తున్నారు. కాగా, తమ రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ యంత్రాంగం, సహాయక సిబ్బంది ప్రయత్నాలను అవమానపరిచారంటూ రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ క్యాంపుపై ఫైర్ అవుతున్నారు. అమెరికాలో కులుకుతున్న నేతలు కూడా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు.ప్రజలు వరదలతో అల్లాడుతుంటే.. అమెరికాలో ఉన్న కేటీఆర్ స్పందిస్తున్నాడు కానీ, తెలంగాలణలో ఉన్న కేసీఆర్ కనీసం నోరు మెదపడం లేదు. దీనిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ చేశారు. తాము ప్రశ్నించిన తర్వాతనే మాజీ మంత్రి హరీశ్‌రావు వరద బాధిత ప్రాంతాల పర్యటన చేపట్టారని విమర్శించారు. ప్రజలకు అండగా నిలవాలన్న సోయి విపక్ష నేతలకు లేదని మండిపడ్డారు.

# తెలంగాణలోనూ...కనిపించని కమలం నేతలు

హైదరాబాద్: తెలంగాణ భారతీయ జనతా పార్టీ నాయకులు అసలైన విషయాలపై స్పందించడం లేదు. ముఖ్య నేతలంతా ఎవరికి వారే అన్నట్లుగా ఉంటున్నారు. ఈ పరిమామం వల్ల అసలు బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. తాజాగా వరదల విషయంలో కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసింది. అవసరమైన హెలికాప్టర్లు, పవర్ బోట్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించలేదని ప్రజల్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీటిని తెలంగాణ బీజేపీ నేతలు కూడా తిప్పికొట్టలేకపోతున్నారు. మామూలుగా అయితే ఏ రేంజ్ లో కావాలంటే ఆ రేంజ్‌లో ఎదురుదాడి చేయవచ్చు . కానీ ఎవరికి వార తమకెందుకు అనుకుంటున్నారు. అందు వల్లే ఎవరూ ముందుకు రావడం లేదు. ఖమ్మంకు ఆ స్థాయిలో వరద వస్తుందని ప్రభుత్వం ఊహించలేకపోయింది. బుడమేరు విజయవాడను ముంచింది కాబట్టి... ఆ నీరు ఖమ్మం వైపు వస్తుందని అంచనా వేయలేకపోయారు. చివరికి మున్నేరు పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది. ఆరేడు అడుగుల ఎత్తున నీరు పారడం అంటే చిన్న విషయం కాదు. మామూలుగా అయితే గోదావరికి వరదలు వస్తే.. ఖమ్మం జిల్లా ఉలిక్కి పడుతుంది. ఈ సారి మాత్రం భిన్నం. అందుకే ప్రభు?తవం పెద్దగా చర్యలు తీసుకోలేకపోయింది. కేంద్రాన్ని కూడా అప్పటికప్పుడు అడిగి ఎలాంటి డిజాస్టర్ రిలీఫ్ చేపట్టలేకపోయింది. హెలికాప్టర్లు లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. తర్వాత రోజే రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనకు వెళ్లినప్పటికీ.. ప్రభుత్వం పెద్దగా ఏమ చేయలేదన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. ఖమ్మంలో ఎలాగూ వైఫల్యం చోటు చేసుకుంది..దాని కారణాన్ని కేంద్రంపై నెట్టేస్తే బెటరనుకుని ఆ పని ప్రారంభించారు. విపత్తు వచ్చినా కేంద్రం కనీసం హెలికాప్టర్ల పంపలేదని.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపలేదని ఆరోపణలు చేయడం ప్రారంభించారు. పక్కన ఉన్న రాష్ట్రానికి 120 పవర్ బోట్లు, హెలికాప్టర్లు, ఎయిర్ ఫోర్స్ కూడా సాయానికి వెళ్లిందని తెలంగాణకు ఒక్కరు కూడా రాలేదని అది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమేనని బీఆర్ఎస్ విమర్శించింది. అయితే ఇది బీజేపీకి సూటిగా తగిలింది. బీజేపీని ఏమీ అనలేని నిస్సహాయత వల్ల కాంగ్రెస్ ను కేటీఆర్ విమర్శించి ఉండవచ్చు కానీ.. కేంద్రం ఏమీ చేయలేదంటే అది బీజేపీ మీదకే వెళ్తుంది. తమపై వస్తున్న విమర్శలకు బీజేపీ కౌంటర్ చేయలేకపోతోంది. దీనికి కారణం సమాధానం లేకపోవడం కాదు. నేతలు పెద్దగా పట్టించుకోకపోవడమే. తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఒక్క లీడర్ కూడా బాధ్యత తీసుకోవడం లేదు. ఫలితంగా బీజేపీపై వచ్చిన విమర్శలు మరకలుగానే పడిపోతున్నాయి. ఎవరికి వారు సొంత ఎజెండా ప్రకారం స్పందించాల్సి వచ్చినప్పుడు స్పందిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేంద్ర బీజేపీ కూడా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ నేతల్ని అలా వదిలేశారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# కంగనా కు ఎమెర్జెన్సీ కష్టాలు

ముంబై: కంగనా రనౌత్ “ఎమర్జెన్సీ” మూవీకి కష్టాలు తప్పడం లేదు. సిక్కు సంస్థలు పెద్ద ఎత్తున ఈ సినిమాని వ్యతిరేకిస్తున్నాయి. విడుదల చేయొద్దని డిమాండ్ చేస్తున్నాయి. ఈ వివాదం కాస్త బాంబే హైకోర్టు వరకూ వెళ్లింది. కోర్టులో అయినా ఊరట వస్తుందని ఆశించిన కంగనా రనౌత్‌కి ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టులో ఈ వివాదం కొనసాగుతోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కి సెన్సార్ సర్టిఫికేట్ జారీ చేయాలని చెప్పలేమని మధ్యప్రదేశ్ కోర్టు తేల్చి చెప్పింది. ఇప్పుడు బాంబే హైకోర్టు కూడా ఇదే విషయం స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్ కోర్టు తీర్పుని ఉల్లంఘించి సర్టిఫికేట్ ఇవ్వాలని ఆదేశించలేమని వెల్లడించింది. సెప్టెంబర్ 18వ తేదీలోగా ఈ సినిమాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నాయో చెప్పాలని సెన్సార్‌బోర్డ్‌కి తేల్చి చెప్పింది. ఈ సినిమాకి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న జివవ వాబిబీటతినీబ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా ఈ విచారణ జరిగింది. ఇద్దరు సభ్యులతో కూడిన ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాని కంగనా రనౌత్ డైరెక్ట్ చేశారు. ప్రొడ్యూసర్ కూడా ఆమే. సెప్టెంబర్ 6వ తేదీనే సినిమా విడుదల కావాల్సి ఉన్నా సిక్కు సంఘాల ఆందోళనలతో వాయిదా పడుతూ వస్తోంది. సిక్కులను చూపించిన విధానం అభ్యంతరకరంగా ఉందని, చరిత్రను మార్చే ప్రయత్నం చేస్తున్నారని మండి పడుతున్నాయి ఆ సంఘాలు. ఈ క్రమంలోనే బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని తాము ఆదేశించలేమని తేల్చి చెప్పింది. మధ్యప్రదేశ్ హైకోర్టు కూడా సినిమాలోని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌కి సూచనలు చేసింది. “ఇలాంటి విషయాల్లో ఓ కోర్టు అభిప్రాయాన్ని మరో కోర్టు విభేదించడం సరికాదు. పిటిషనర్లు కోరుకున్న విధంగా ఈ సినిమాకి సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని మేం బోర్డ్‌ని ఆదేశించలేం. అలా అని ఈ పిటిషన్‌ని పక్కన పెట్టడం లేదు. అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోవాలని మాత్రం ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డ్‌కి చెప్పగలం”

- బాంబే హైకోర్టు

ఎంతో డబ్బు ఖర్చు పెట్టి సినిమాలు తీస్తారని, ఇలాంటి వివాదాలను గాలికి వదిలేయడం సరికాదని వ్యాఖ్యానించింది బాంబే హైకోర్టు. సీబీఎఫ్‌సీకి కొంత గడువు ఇచ్చింది. వినాయక చవితిని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఈ సమస్యని తేల్చాలని సూచించింది.

# అమెరికాలో ప్రమాదం, నలుగురు హైదరాబాదీలు మృతి

హైదరాబాద్: అమెరికాలోని టెక్సాస్‌లో 5 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీలతో సహా నలుగురు భారతీయులు మరణించారు. అందరూ ఒకే కారులో భారతీయ కార్‌పూలింగ్ యాప్ ద్వారా అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు ప్రయాణిస్తున్నారు. మృతులను హైదరాబాద్‌కు ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి, ఫరూక్ షేక్, లోకేష్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌లుగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.కొల్లిన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వైట్ స్ట్రీట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది..

వేగంగా వచ్చిన ట్రక్ అదుపుతప్పి ఎస్‌యూవీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ తర్వాత ట్రక్కు మరో నాలుగు వాహనాలను ఢీకొని డివైడర్‌ను ఢీకొట్టింది. అందరూ తేరుకునేలోపే కారు వాహనం మంటల్లో చిక్కుకుంది. నలుగురు భారతీయులు కారులో చిక్కుకున్నారు. మంటల కారణంగా నలుగురూ సజీవదహనమయ్యారు. కార్‌పూలింగ్ యాప్ ద్వారా స్థానిక పోలీసులు వారిని గుర్తించారు. హైదరాబాద్ నివాసి ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి అతని స్నేహితుడు ఫరూక్ షేక్‌తో కలిసి డల్లాస్‌లోని తమ బంధువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా, లోకేష్ తన భార్యను కలవడానికి బెంటన్‌విల్లేకు వెళ్తున్నాడు. ఇక తమిళనాడుకు చెందిన ధరిణి వాసుదేవన్ టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివిన తర్వాత అక్కడే పనిచేస్తున్నారు. ఆమె బెంటన్‌విల్లేలోని తన మామ వద్దకు వెళ్తున్నారు. ఈ నలుగురూ కార్‌పూలింగ్ యాప్ ద్వారా కనెక్ట్ అయిన తర్వాత అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఆర్యన్ ఓరంపాటి ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాకు వెళ్లాడు. అతని తండ్రి సుభాష్ చంద్రారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారవేత్త. హైదరాబాద్‌కు చెందిన ఫరూక్ షేక్ మాస్టర్స్ డిగ్రీ కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లి బెంటన్‌విల్లేలో నివసిస్తున్నాడు. భారతీయులంతా కాలిపోయిన తర్వాత వారి మృతదేహాలను గుర్తించడం కష్టంగా మారింది. వారి శరీర భాగాల నమూనాలను డీఎన్‌ఏ పరీక్ష కోసం ఉంచారు. 3 రోజుల తర్వాత కుమార్తె మృతి చెందిన విషయం ధరిణి తండ్రికి తెలిసింది. అంతకు ముందు, తన కూతురు అదృశ్యంపై సమాచారంతో ట్విట్టర్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహాయం కోరారు. కాగా, వారి అవశేషాలు భారత్ రప్పించేందుకు బాధితుల కుటుంబాలు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారుల సహాయాన్ని కోరుతున్నాయి.

# పగలు సాయం... రాత్రి చోరీ

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో వెరైటీ దొంగల బండారం బయటపడింది. ఉదయం.. దర్జాగా నటించి, రాత్రి అయితే చాలు, చటుక్కున మాయం చేస్తున్నారు. పక్కా స్కెచ్ వేసిన హైదరాబాద్ పోలీసులు కేటుగాళ్ల గుట్టురట్టు చేశారు. బోరబండ ప్రాంతంలో రాత్రి వేళల్లో ఓ విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. బీఎస్ఎన్ఎల్ కంపెనీకి సంబంధించిన భూగర్భ కేబుల్స్‌ను దొంగతనం చేశారు. అనుమానం వచ్చి సీసీ కెమెరా ఫుటేజీ చెక్ చేయడంతో అసలు భాగోతం బయటపడింది.బోరబండ ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ కంపెనీకి సంబంధించిన భూగర్భ కేబుల్స్ పనులు జరుగుతున్నాయి. 14 మంది సభ్యులతో కూడిన ఒక గ్యాంగ్ కూలీల అవతారం ఎత్తారు. ఈ గ్యాంగ్ సభ్యులు రోడ్డు పనుల కోసం కార్మికులుగా మారిపోయి, రాత్రి పూట తమ కార్యాచరణను కొనసాగించారు. అందరూ ఒక్కసారిగా వచ్చినట్లు కాకుండా, ఈ గ్యాంగ్ సభ్యులు తమను అధికారిక సిబ్బందిగా చూపించడానికి ప్రతిరోజూ రాత్రి రెఫ్లెక్టివ్ జాకెట్లు ధరించి వచ్చేవారు. వీరి ఉద్దేశం రాత్రి వేళల్లో ఎవరికీ అనుమానం రాకుండా పనులు చేసుకోవడం. పక్కా స్కెచ్‌తో వీరు మరింత విశ్వసనీయంగా కనిపించడానికి సంబంధిత పనులు చేస్తున్నట్లు ప్రజల ముందు ప్రవర్తించారు. గ్యాంగ్ సభ్యులు రాత్రివేళల్లో బీఎస్ఎన్ఎల్ కేబుల్స్‌ను కట్ చేసి తీసుకెళ్లడం మొదలుపెట్టారు. ఈ కేబుల్స్ లో ముఖ్యమైన కాపర్ వంటివి దొంగిలించారు. ఇలా 10 లక్షల రూపాయల విలువైన కాపర్ వైర్లు కొట్టేశారు.అయితే, ఈ గ్యాంగ్ అనుకోని విధంగా వారి పథకం విఫలమైంది. అయితే వీరు చేస్తున్న పనిని సీసీ కెమెరా దృశ్యాలు పట్టించాయి. హైదరాబాద్ బోయిన్‌పల్లి పోలీసులు వీరి అనుమానాస్పద దృశ్యాలను గమనించారు. అనుమానం కలిగిన పోలీసులు వారికి అనుమానం రాకుండానే గ్యాంగ్ సభ్యులను పట్టుకున్నారు. తీరా విచారణ చేసినప్పుడు, ఈ గ్యాంగ్ సభ్యులు తమ కార్మికుల వేషాలతో అసలు నిజాన్ని పోలీసుల ముందు ఒప్పుకున్నారు.పోలీసులు ఎట్టకేలకు వీరి నుంచి దొంగిలించిన కేబుల్స్‌ను స్వాధీనం చేసుకుని, 14 మంది సభ్యులను అరెస్టు చేశారు. వీరి ఆర్థిక పరిస్థితి బాగోలేని కారణంగానే ఈ తరహాలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు విచారణలో బయటపడింది. వీరంతా కేవలం రాత్రి వేళల్లోనే ఈ తరహా కేబుల్స్ దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో పోలీస్ కమాండ్ కంట్రోల్స్ సెంటర్‌లోనూ ఇదే తరహాలో కేబుల్స్ మాయమైన ఘటన చోటుచేసుకుంది. ఆ వ్యవహారంలోనూ పోలీసులు పలువురిని అరెస్టు చేశారు.

# ఏపీ కంటే బాగా పని చేశాం

హైదరాబాద్: ఎడతెరిపి లేని వర్షాలు, వరదల తాకిడికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎవర్ని కదిలించినా కన్నీటి చిత్రాలే. ముఖ్యంగా తెలంగాణలోని ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాల ప్రజలు వర్షాలు, వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితులు రోజురోజుకీ ఘోరంగా మారిపోతున్నాయి. దీనిపై విపక్షాల నుంచి రెండు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయి.

పక్క రాష్ట్రం కన్నా బాగా చేశాం: రేవంత్ రెడ్డి

తెలంగాణలోని వరద పరిస్థితులపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సహాయక చర్యలు తీసుకోవడంలో కానీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో కానీ తెలంగాణ ప్రభుత్వం, అధికారులు చాలా అద్భుతంగా పనిచేశారని అన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తంగా లేకపోవడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని రేవంత్ అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించడం లేదని, ప్రజలు కోలుకోవాలని కోరుకుంటున్నానని చెబుతూనే చంద్రబాబును కార్నర్ చేశారు. ఈ వీడియోను ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా బాగా వాడుకుంటోంది. రేవంత్ మాటలు వైసీపీ చేతికి మంచి ఆయుధం ఇచ్చాయి. మేం కూడా మొదట్నుంచి అదే చెబుతున్నామని ప్రచారం చేస్తున్నారు.

విజయవాడ వరద మ్యాన్ మేడ్ డిజాస్టర్ : వైఎస్ జగన్

వరదల నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ విజయవాడలోని సింగ్ నగర్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడి బాధితుల సమస్యలుల అడిగి తెలుసుకుని అనంతరం మీడియాలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం చంద్రబాబు అప్రమత్తంగా వ్యవహించకపోవడం వల్ల, ఆయన అసమర్థత వల్లనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆరోపించారు. తన హయాంలోనూ వరుసగా మూడేళ్లు 8 నుంచి 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినా విజయవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. కనీస ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.ఎక్కడా పునరావాస శిబిరాలు ఉన్నట్టే కనిపించడం లేదని, సహాయక చర్యల కన్నా పబ్లిసిటీకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం దారుణమన్నారు. ఫైనల్‌గా మ్యాన్ మేడ్ డిజాస్టర్‌గా తేల్చేశారు. విజయవాడ వరదలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వైసీపీ తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది. ఒకేరకమైన వర్షం, ఒకే రకమైన పరిస్థితులున్నా ఆంధ్రలో కన్నా, తెలంగాణలో నష్టం తక్కువ జరిగిందని రేవంత్ అన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉండటం వల్లనే నష్టం తగ్గించగలిగామని చెప్పుకొ చ్చారు. ఆంధ్రా ప్రభుత్వం, చంద్రబాబు అప్రమత్తంగా లేరని వైసీపీ ప్రచారం చేస్తోంది.

కన్నీరు పెట్టిస్తున్న వీడియోలు..

మనిషిలోతు వరదల్లో మునిగిపోయి తిండీతిప్పలు లేకుండా ఇబ్బందుల్లో ఉన్న వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఓ వైపు సాయం చేస్తున్నప్పటికీ ఇంకా సరిపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుడమేరు వాగు పొంగడంతో విజయవాడ సిటీలోని కీలక ప్రాంతాలు నీట మునిగాయి. మొదటి ఫ్లోర్ వరకు మునిగిపోయి ఉన్నాయి. ఎక్కడా కరెంట్ లేదు.. పిల్లలకు తాగడానికి పాలు లేవు. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు నిద్రాహారాలు లేక అల్లాడిపోతున్నారు. ఎక్కడికి వెళ్లాలన్నా మనిషిలోతు వరద, బోటు అడిగితే కిలోమీటర్‌కి మనిషికి వెయ్యి రూపాయలు అడుగుతున్నారు. పునరావాస శిబిరాలు ఎక్కడున్నాయో తెలియడం లేదని వాపోతున్నారు. హెలికాప్టర్ల నుంచి అన్నం పార్శిళ్లు బురదలో విసిరేస్తే తీసుకోవడం, వ్యాన్ దగ్గర నీళ్ల బాటిళ్లు, అన్నం కోసం కొట్టుకోవడం లాంటి దృశ్యాలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

# ఉద్యోగుల జేఏసీ 100 కోట్ల విరాళం

హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలో వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్నాయి. వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా మున్నేరు వారు ఉపొంగి, ఖమ్మం నగరం దిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల సైతం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులు సైతం అండగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని ఆయన గుర్తు చేశారు. ప్రకృతి విపత్తు కారణంగా భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందన్న లచ్చిరెడ్డి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది అతిపెద్ద విపత్తుగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ భావించిందన్నారు జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి.ఇలాంటి సమయంలో తమ వంతుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక పరంగా చేయూతగా నిలవాలని భావించామన్నారు. అందులో భాగంగా రాష్ట్రం లోని ఉద్యోగుల తరుపున ఒక రోజు వేతనం సుమారు రూ.100 కోట్లను ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. వరద బాధితులకు అండగా నిలుస్తామన్నారు.తెలంగాణలోని అన్ని ప్రభుత్వ విభాగాలలోని ఉద్యోగుల తరఫున సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు లచ్చిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉద్యోగులుగా వరద విపత్తు సృష్టించిన ప్రాంతాలలో ప్రత్యక్షంగా సహాయక చర్యల్లో పాల్గొనడంతో పాటు తమ బాధ్యతగా ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందచేయనున్నట్టుగా చెప్పారు.

# ఎస్సై, కానిస్టేబుల్ వివాహేతర సంబంధం

చెన్నై: వివాహేతర సంబంధాలు నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. సమాజంలో ఇలాంటివి నిత్యం జరుగుతున్నప్పటికీ మనుషుల్లో ఏమాత్రం మార్పు రావాడం లేదు.. కేసులు అవుతున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు.. వివాహేతర సంబంధం మానుకోవాలని పలుమార్లు హెచ్చరించినా.. భార్య వినేలేదు.. దీంతో భర్త భార్యను హత్యచేశాడు.. చివరకు పోలీసులు అరెస్టు చేసి విచారించగా.. షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.. ఆమెతో అక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని.. తెలియడంతో అధికారులు అతన్ని సస్పెండ్ చేశారు.. అంతేకాకుండా.. అంతకుముందు కానిస్టేబుల్ కూడా ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్నట్లు తెలిసి.. అతడిని కూడా సస్పెండ్ చేశారు.. ఈ ఘటన తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా, ఉలుందర్‌పేట పక్కనే ఉన్న పిల్లూరులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళ్లకురిచ్చి జిల్లా, ఉలుందర్‌పేట పక్కనే ఉన్న పిల్లూరులో దంపతులు అశోక్ (35), రమణి, 32 నివసిస్తున్నారు.. ఈ క్రమంలో వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవజరిగింది.. గత నెల 19న ఆమెను భర్త అశోక్ హత్య చేసి పారిపోయాడు.. దీంతో ఉతక్కల్ పోలీసులు అశోక్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. భార్య రమణి.. తిరునావలూరులో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ నందగోపాల్‌తో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుందని తెలిపాడు.. మానుకోవాలని చెప్పినందుకు చంపేస్తానని బెదిరించాడని తెలిపాడు.. ఇదే విషయంపై భార్యను నిలదీయగా ఇద్దరి మధ్య గొడవ జరగిందని.. దీంతో హత్య చేసినట్లు అశోక్ తెలిపాడు. అంతకుముందు కూడా రమణికి పలువురితో సంబంధాలున్నట్లు తెలిపాడు..దీంతో ఎస్సై నందగోపాల్ పై ఉన్నతాధికారులు శాఖాపరమైన దర్యాప్తునకు ఆదేశించారు. రమణితో వివాహేతర సంబంధం నిజమని తెలియడంతో విళుపురం రేంజ్ డీఐజీ దిశా మిట్టల్ నందగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.అదేవిధంగా విళుపురం జిల్లా మరక్కాణం హెడ్ కానిస్టేబుల్ ప్రభాకరన్ కళ్లకురిచ్చిలో పని చేసే సమయంలో రమణితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని విచారణలో తెలియడంతో అతన్ని కూడా సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

# మడిపల్లి చెరువు గండి పూడ్చాలని ఎమ్మార్వో కు వినతి

**కబ్జాకు గురి అయిన భూమిని వెనక్కి తీసుకోవాలి**

**ఊరికి ప్రాణ రక్షణగా ఉన్న చెరువును రక్షించండి**

**కొత్తగా వేసిన గండిని పూడ్చండి**

**- చెరువులో నీళ్లు నిలువ ఉండేలా చూడండి**

**- మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేకమళ్ల అశోక్**

**- జమ్మికుంట తహసిల్దార్ రమేష్ బాబుకు వినతి**

జమ్మికుంట: మండలం మడిపల్లి గ్రామ పెద్ద చెరువు మడిపల్లి -అంకుశాపూర్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న చెరువు దొరల హయాంలో అమాయక రైతులకు అమ్మి వాటిని పట్టా భూములుగా మార్చటం జరిగిందని. చెరువు ను కొన్నటువంటి అమాయక రైతులు మావి పట్టా భూములని మేము వ్యవసాయం చేసుకుంటామని అధికారులను తప్పుదోవ పట్టిస్తూ చెరువు నిర్మాణం జరిగినప్పుడు ఉన్నటువంటి తూము ఉండగా గత ప్రభుత్వ పెద్దల సహకారంతో ప్రత్యేకంగా అంకుషాపూర్ రోడ్డున చెరువుకు పెద్ద గండి పెట్టి చెరువులో చుక్క నీరు కూడా ఉండకుండా చేస్తున్నటువంటి దుస్థితి మడిపల్లి చెరువుకు ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులు కుంటలు నిండి జలకలాడుతూ ఉంటే మడిపల్లి చెరువు మాత్రం విలవిల వాడిపోతున్నది. దీనంతటికీ కారణం ప్రత్యేకంగా చెరువుకు గండిపెట్టి పడ్డ నీరు పడ్డట్లే పోయేటట్లుగా అధికారులతో కుమ్మక్కై చేసినటువంటి పరిస్థితి. దీన్ని గ్రహించిన రైతుల సంక్షేమం కోసం మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేకమళ్ళ అశోక్ బుధవారం జమ్మికుంట తహసిల్దార్ రమేష్ బాబు,కి వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా నూతనంగా చెరువుకు పెట్టినటువంటి గండిని పూడ్చాలని, అమాయక రైతుల నుండి కబ్జాకు గురి అయిన చెరువు భూమిని స్వాధీనం చేసుకోవాలని అవసరమైతే హైడ్రా చట్టాన్ని ఉపయోగించుకోవాలని తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఒకవేళ తక్షణ చర్యలు తీసుకోనట్లయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని కోరారు..

# టేకుమట్ల - రాఘవరెడ్డిపేట వంతెన పున:ప్రారంభం

జయశంకర్ భూపాలపల్లి: భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని టేకుమట్ల - రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై పున:నిర్మాణమైన హై లెవల్ వంతెనను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు టేకుమట్ల – రాఘవరెడ్డిపేట వంతెన పిల్లర్లు కుంగినట్లు తెలిపారు. ఆ రోజు వంతెనను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో అంచనాలు రూపొందించి వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపగా, రూ.4.70 కోట్లతో యుద్ధప్రాతిపదికన వంతెన పున:నిర్మాణ పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అతి తక్కువ సమయంలోనే వంతెన నిర్మాణంను పూర్తి చేసిన సదరు గుత్తేదారుడు (శ్రీ వేంకటేశ్వర కన్స్ట్రక్షన్) ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో టేకుమట్ల మండలంలోని వాగవతలి సుమారు తొమ్మిది నుండి పది గ్రామాల ప్రజలకు మార్గం సుగమం అయినట్లు తెలిపారు. అనంతరం గుత్తేదారు, అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ పుష్పగుచ్చం, శాలువాతో సన్మానించారు.

**కళ్యాణలక్ష్మీ..షాది ముబారక్ చెక్కులు అందజేత**

టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 15 మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.15,01,740 విలువ గల చెక్కులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణలక్ష్మి పథకం నిలుస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజా ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద, నిరుపేద కుటుంబాల ఆడపిల్లల పెండ్లికి ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మార్పుపై ఆచితూచి అడుగులు

వరంగల్: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు. హస్తం పార్టీలో ఎదురుదెబ్బలే తగులుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వలస రాగా, ఒకరిద్దరికి తప్ప మిగిలిన చోట.. ఎమ్మెల్యేలను స్థానిక కాంగ్రెస్ నేతలు కలుపుకుని పోవడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇలాంటి చోట వలస ఎమ్మెల్యేలతో స్థానిక నేతలకు సమన్వయం చేయాల్సిన పార్టీ..ఆ పని చేయకపోవడంతో రానురాను సమస్య జటిలం అవుతోందని అంటున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యపై కాంగ్రెస్ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేయడాన్ని ఇందుకు ప్రధాన ఉదాహరణగా చెబుతున్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారిలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వర్గం సహాయ నిరాకరణ చేస్తోంది. అదేవిధంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి నియోజకవర్గ ఇన్‌చార్జి సరితతో పొసగడం లేదు. చేవెళ్లలోనూ పార్టీ ఇన్‌చార్జి భరత్‌తో ఎమ్మెల్యే యాదయ్య వర్గానికి గ్యాప్ కంటిన్యూ అవుతోంది. సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డికి మధ్య రాజీ కుదరలేదని ప్రచారం జరుగుతోంది. ఇక ఖైరతాబాద్‌లోనూ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇన్‌చార్జి విజయారెడ్డి వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు.ఇలా ఒకరిద్దరు తప్పితే మిగిలిన ఎమ్మెల్యేలు అంతా పార్టీ ఇన్‌చార్జులతో ఇబ్బందులు ఎదుర్కొంటు ఉండటమే.. వలసలకు బ్రేక్ పడిందనే వాదన వినిపిస్తోంది. 26 మంది ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా దక్కకుండా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుండగా, ఆయన లక్ష్యానికి గండి కొట్టేలా పార్టీ ఇన్‌చార్జులు ప్రవర్తిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. వలస ఎమ్మెల్యేలకు.. పార్టీ క్యాడర్‌కు మధ్య సమన్వయం కుదర్చాల్సిన పార్టీ విభాగం? అంతా సీఎం చూసుకుంటారులే అని వదిలేయడంతో రోజురోజుకు సమస్య తీవ్రమవుతోందంటున్నారు. ఇలాంటి సమస్యలను పార్టీ పరంగా పరిష్కరించాల్సివున్నప్పటికీ పీసీసీ చీఫ్‌గా సీఎం రేవంత్‌రెడ్డే కొనసాగు తుండటం వల్ల.. ఆయన పార్టీ వ్యవహారాలపై ఫోకస్ చేయలేకపోతు న్నారు. ఇదే సమయంలో వివాదాలను చక్కదిద్దేందుకు ఆయా జిల్లా మంత్రులు ప్రయత్నిస్తున్నప్పటికీ. ఇన్‌చార్జులు లెక్క చేయడం లేదు. అలాంటి వారిపై చర్యలు తీసుకునే అధికారం మంత్రు లకు కూడా లేకపోవడంతో ధిక్కార స్వరాలను అదుపు చేయలేకపోతు న్నారని అంటున్నారు. జగిత్యాలలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య రాజీ కుదర్చేందుకు ఆ జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రయత్నించినా, వృథా ప్రయాసే అయిందంటున్నారు. ఇక గద్వాలలోనూ మంత్రి జూపల్లికి ఎదురుదెబ్బే తగిలింది. తన శిష్యుడైన ఎమ్మెల్యే కృష్ణమోహ న్‌రెడ్డిని జూపల్లి కాంగ్రెస్‌లో తీసుకురాగా, ఆయన ఆధిపత్యాన్ని నిలదీస్తూ నిత్యం ఏదో రచ్చ చేస్తున్నారు పార్టీ ఇన్‌చార్జి సరిత. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో చేరికకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి భరోసాతో కాంగ్రెస్‌లోకి వెళ్లినా? స్థానిక కాంగ్రెస్ నేతలతో ఇబ్బందులు కంటిన్యూ అయితే?. ప్రయోజనం ఏముంటుందని ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గుతున్నట్లు చెబుతున్నారు. మరి ఈ పరిస్థితులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఎలా చక్కదిద్దుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# సీఎంఆర్ఎఫ్ స్కామ్ మామూలుగా లేదుగా

హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) స్కామ్‌లో ప్రభుత్వ నిధులను స్వాహా చేసేందుకు నకిలీ మెడికల్ బిల్లులు సమర్పించిన ఇద్దరు వ్యక్తులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల నుంచి సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. దీంతో ఆగస్టు 23న ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. నిరుపేద రోగుల వైద్యం కోసం ఉద్దేశించిన (సీఎంఆర్ఎఫ్ నుండి నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై తెలంగాణలోని 27 ఆసుపత్రులపై అఎఆ విచారణ జరుగుతోంది. ఈ ఆసుపత్రుల పై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించింది సీఐడీ. విచారణలో భాగంగా నల్గొండ జిల్లాకు చెందిన నిందితులు గొట్టి గిరి(46), ఆసుపత్రి సూపర్‌వైజర్ లెకిరెడ్డి సైదిరెడ్డి(40)లను పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాల్‌గూడలో స్థానిక ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఈ వ్యవహారం నడిచినట్లు పోలీసులు గుర్తించారు. డెస్క్‌టాప్ కంప్యూటర్లతో నకిలీ సీఎంఆర్ఎఫ్ బిల్లులు సృష్టించి వైద్యులు, ఆసుపత్రుల రబ్బరు స్టాంపులను తయారు చేశారు. నిందితులు ఒక్కో దరఖాస్తుకు రూ.4,000 చొప్పున వసూలు చేసి, నల్గొండలోని అమ్మ హాస్పిటల్, మిర్యాలగూడలోని నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పేర్లతో అవసరమైన రోగులకు సహాయం చేయడానికి 19 నకిలీ క్లెయిమ్‌లను సమర్పించారు.నల్గొండలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిఐడి) ఆగస్టు 30న ఇద్దరిని అరెస్టు చేసింది. నిందితుల నుంచి నకిలీ మెడికల్ బిల్లులు, రబ్బరు స్టాంపులు, నకిలీ లెటర్ హెడ్‌ల సాఫ్ట్ కాపీలతో కూడిన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌తో సహా కీలకమైన సాక్ష్యాలను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. నిందితులను కోర్టు ముందు హాజరుపరచగా, వారిని జ్యుడీషి యల్ రిమాండ్‌కు తరలించారు. స్కామ్‌లో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు తదుపరి విచారణ కొనసాగుతోంది.

# కేసీఆర్ మౌనమే వ్యూహమా...?

హైదరాబాద్: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చాలా రోజుల తర్వాత ఇటీవల బయట కనిపించారు. బయట అంటే.. ఆయన ఫామ్ హౌస్‌లోనే జైలు నుంచి వచ్చిన కుమార్తెకు స్వాగతం చెబుతూ కనిపించారు. ఆ దృశ్యాలు బయటకు వచ్చాయి. అప్పటి వరకూ దాదాపుగా రెండు నెలలు ఆయన బయట కనిపించకపోయే సరికి ఆరోగ్యం బాగో లేదన్న పుకార్లు కూడా వచ్చాయి. కానీ కేసీఆర్ వేటినీ పట్టించుకోలేదు. బయటకు రాలేదు. కవిత జైలు నుంచి వచ్చిన తర్వాత ఆయన కార్యచరణ ఉంటుందని.. వెంటనే రైతుల కోసం టూర్ కి వెళ్తారని బీఆర్ఎస్ వర్గాలు లీక్ ఇచ్చాయి. కానీ అది లీక్ గానే మిగిలింది .ఆయన సైలెంట్ గానే ఉన్నారు. ఇంతటి వరదలు వస్తే ప్రతిపక్ష నేత కేసీఆర్ కనీసం బయటకు వచ్చి కూడా చూడలేదని.. అలాంటి ప్రతిపక్షానికి తాము ఎలా సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్ కు పరిమితం అయితే.. ఆయన కుమారుడు అమెరికాలో జల్సా చేస్తున్నారని.. అక్కడ్నుంచి సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ను రేవంత్ టార్గెట్ చేయడం ఇదే మొదటి సారి కాదు. అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడం దగ్గర్నుంచి కేసీఆర్ ఎందుకు బయటకు రారని పదే పదే ప్రశ్నిస్తూ వస్తున్నారు. కానీ బీఆర్ఎస్ వద్ద సరైన సమాధానమే లేకుండా పోయింది. అయితే రైతు రుణమాఫీ ఇతర అంశాలపై కాంగ్రెస్ తీరును ఎండగట్టేందుకు కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ అయ్యారని.. రూట్ మ్యాప్ పై కసరత్తు కూడా చేశారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. వాతావరణం సాధారణంగా ఉంటే ఈ పాటికి ఆయన బస్సు తెలంగాణ రోడ్లపై పరుగులు పెడుతూ ఉండేదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడేవారని అంటున్నారు. వర్షం తగ్గిన తర్వాత మంచి రోజు చూసుకుని కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తారని చెబుతున్నారు. అయితే ప్రజల్లోకి వెళ్లడానికి ఇంత కన్నా మంచి సందర్భం ఏమి ఉంటుందని.. ప్రభుత్వ వైఫల్యంపై విరుచుకుపడితే పార్టీకే మేలు కదా అని బీఆర్ఎస్ నేతల్లోనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో మౌనానిది కీలక పాత్ర. ఆయన కీలకమైన విషయాల్లో మౌనంగా ఉంటారు. సరైన సమయం చూసి ఎంటర్ అవుతారు. సిక్సర్ కొడతారు. అప్పటి వరకూ ఆయన చుట్టు ముసురుకున్న వ్యతిరేకత అంతా పాజిటివ్ గా మారుతుంది. రేవంత్ ప్రభుత్వానికి సమయం ఇచ్చేందుకే ఆయన సైలెంట్ గా ఉన్నారని.. ఇవాళ కాకపోతే రేపు.. రేపు కాకపోతే ఎల్లుండి ఆయన ప్రజల్లోకి వస్తారని .. కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తారని బీఆర్ఎస్ వర్గాలు నమ్ముతున్నాయి. అయితే మంచి అవకాశాల్ని కోల్పోతున్నామన్న భావన మాత్రం కొంత మంది బీఆర్ఎస్ నేతల్లో కనిపిస్తోంది. కేసీఆర్ మళ్లీ యాక్టివ్ అయితే పార్టీ పుంజుకునే అవకాశం ఉందని, అదే సమయంలో అనుకున్న సంఖ్యలో వలసలు లేకపోతే అనర్హత వేటు పడే ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని కొందరు ఎమ్మెల్యేలు భయపడుతున్నట్లు చెబుతున్నారు. కేసీఆర్ కూడా తనను కలిసిన ఎమ్మెల్యేలతో వలస వెళ్లిన వారిపై అనర్హత వేటు వేయించడంతోపాటు కాంగ్రెస్ హామీలపై ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. జంపింగ్ ఎమ్మెల్యేలపై వేటు వేయడమే టార్గెట్‌గా పెట్టుకున్న బీఆర్ఎస్?. పార్టీ అధినేత రంగంలోకి దిగిన తర్వాత అనర్హత వేటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా పావులు కదుపుతోందంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎక్కువగా ఫాం హౌస్‌లో ఉంటున్న మాజీ సీఎం కేసీఆర్? తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని తాజాగా అంచనాకు వచ్చిన కేసీఆర్? స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పునర్ వైభవం తెచ్చేందుకు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణకు



సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రైతు రుణమాఫీపై అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. రకరకాల నిబంధనలు విధించడం వల్ల.. 30 వేల కోట్లకుపైగా అవుతుందని అంచనా వేసిన రైతు రుణమాఫీ కేవలం 17 వేల కోట్లతో సరిపెట్టిందని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ విషయమై కృష్ణార్జునులు హరీశ్ రావు, కేటీఆర్ ఇప్పటికే ఫైట్ చేస్తున్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని భావిస్తోంది బీఆర్ఎస్. ఇందుకోసం నేరుగా అధినేత రంగంలోకి దిగితే స్థానిక ఎన్నికల్లో అడ్వాంటేజ్ అయ్యే అవకాశం ఉందని ఊహిస్తోంది. కేసీఆర్ కూడా తగిన సమయం వరకు వేచి చూద్దామని ఇన్నాళ్లు ఆగారని.. ఇప్పుడు సమయం ఆసన్నమైనందున సమర శంఖం పూరించాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. వినాయక చవితి తర్వాత ఎప్పుడైనా, రైతు యాత్రలు ప్రారంభించేలా ప్లాన్ చేయాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు చెబుతున్నారు.

# బీహార్ రాజకీయాల్లో ప్రకంపనలు

పాట్నా: బీహార్ రాజకీయాల్లో మరోసారి 'పొలిటికల్ గేమ్' జరగబోతుందా? సింగపూర్ నుంచి ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తిరిగి రావడంతో బీహార్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, అసెంబ్లీ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. ఇప్పుడు రెండవ రోజు, ఖీఏఆ ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో లాలూ ప్రసాద్ యాదవ్ సమావేశమవుతున్నారు. ఈ పరిస్థితులన్నింటిని గమనిస్తుంటే, రాష్ట్రంలో కొత్త ప్రయోగానికి స్క్రిప్ట్ రాసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి సచివాలయంలో సీఎం నితీశ్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. నితీష్–తేజస్విల ఈ వన్ టు వన్ భేటీ అకస్మాత్తుగా జరగలేదు కానీ ప్లాన్ చేసిందే అంటున్నారు పార్టీ వర్గాలు. బీహార్‌లో సమాచార కమిషనర్ నియామకంపై చర్చించేందుకు ఇరువురు నేతలు సమావేశమయ్యారు. సమాచార కమిషనర్ నియామకం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ముఖ్యమంత్రితోపాటు, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, కేబినెట్ మంత్రి కూడా ఉన్నారు. అందుకే ఇద్దరు నేతలూ సమావేశమయ్యారు. అయితే సమాచార కమిషనర్ పేర్ల గురించి చర్చించడానికి బదులుగా, కొత్త పొలిటికల్ కెమిస్ట్రీని సృష్టించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను కలిసిన తర్వాత తేజస్వి యాదవ్ బయటకు వచ్చినప్పుడు, అతను స్వయంగా మొత్తం పరిస్థితిని ముందుకు తీసుకువచ్చాడు. కొన్ని నియామకాలు జరగాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా సమాచారం ఇవ్వనుంది. 65 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై సీఎంతో మాట్లాడినట్లు తేజస్వి తెలిపారు. అయితే ఈ అంశం కోర్టులో ఉందని, దీనిపై తాను కోర్టును ఆశ్రయించినట్లు తేజస్వీ తెలిపారు. ప్రభుత్వం తన అభిప్రాయాలను కోర్టులో తెలియజేయాలని, తాను కూడా తన అభిప్రాయాలను తెలియజేస్తానని అన్నారు. మరోవైపు తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లాలూ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. తన ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శాసనమండలి సభ్యులు, అభ్యర్థులను లాలూ యాదవ్ పిలిచారు. పార్టీ సంస్థాగతాన్ని బలోపేతం చేసేందుకు అందరికి పిలుపునిచ్చినట్లు ఆర్జేడీ వర్గాలు పేర్కొన్నాయి. తేజస్వీ యాదవ్ సెప్టెంబర్ 10 నుంచి బీహార్‌లో అభర్ యాత్ర ప్రారంభించనున్నారు. లాలూ యాదవ్ తన పర్యటనను విజయవంతం చేసేందుకు వ్యూహరచన చేయడం ప్రారంభించారని, అందుకే ఆర్జేడీ తన నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు. ఒకవైపు బీహార్ సెక్రటేరియట్‌లో నితీష్, తేజస్విలు సమావేశమవుతుండగా, మరోవైపు లాలూ యాదవ్ తన నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నితీష్, తేజస్విల భేటీకి అనేక కారణాలు చెబుతున్నప్పటికీ ఈ భేటీ ఒక్కసారిగా బీహార్‌లో రాజకీయ ఉత్కంఠకు తెర లేచినట్లైంది. సమాచార కమిషనర్ నియామకమే ఈ సమావేశం ఉద్దేశమని తేజస్వి చెప్పారు. ఇది జరిగిన తర్వాత కూడా కేవలం సమాచార కమిషనర్ నియామకానికే పరిమితం కాలేదన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. బీహార్‌లో పొలిటికల్ గేమ్ గురించి ఊహాగానాలు జరుగుతున్నాయి. ఎందుకంటే 2022 లో తేజస్వి, నితీష్ మధ్య అలాంటి సమావేశాలు జరిగాయి. ఆపై రాష్ట్ర రాజకీయ ఆట మారిపోయింది. అదే సమయంలో తేజస్వి యాదవ్ కుల గణన చేయాలనే డిమాండ్‌తో నితీష్‌ను కలిశారు. తేజస్వి డిమాండ్ సహేతుకమైనదని నితీశ్ భావించారు. దీని తరువాత, దీనికి సంబంధించి రెండవ సమావేశం కూడా జరిగింది. దీంతో నితీష్ కుమార్ ఎన్డీయే నుంచి పార్టీ మారి మహాకూటమిలో చేరారు. బీహార్‌లో మహాకూటమి ప్రభుత్వం ఏర్పడింది. నితీష్ కుమార్, తేజస్వి యాదవ్ మధ్య మరోసారి భేటీ జరిగింది. నితీష్ కుమార్ ఎన్డీయే శిబిరంలో చేరిన ఎనిమిది నెలల తర్వాత తేజస్వి యాదవ్‌తో వన్ టు వన్ సమా వేశం జరిగింది. అయితే లోక్‌సభ ఎన్నికల అనంతరం పాట్నా నుంచి ఢిల్లీకి వస్తున్న విమానంలో వారిద్దరూ కలిసి కనిపించారు. ఇద్దరు రాజకీయ నాయకులు కలిస్తే కేవలం ఎజెండాపైనే చర్చించు కోరని, ఒకరి యోగక్షేమాలు మరొకరు ఆరా తీయరని రాష్ట్ర సమాచార కమిష నర్ అంశంపై నితీష్–తేజస్వీల భేటీపై రాజకీయ విశ్లేషకులు వాదిస్తు న్నారు. వారు రాజకీయ విషయాలు, రాజకీయ సమీకరణాలపై కూడా ఒకరి మనస్సును మరొకరు తీసుకుంటారు. అందుకే నితీష్ తేజస్వి మధ్య భేటీ రాజకీయ అర్థం మారుతోందం టున్నారు నిపుణులు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సింగపూర్‌లో హెల్త్ చెకప్ చేయించు కుని తిరిగి వచ్చిన తర్వాత యాక్టివ్‌గా ఉన్నారు. రాగానే ఆయన రాజకీయ కార్యకలాపాలు కూడా జోరందుకున్నాయి. తేజస్వి యాదవ్ బీహార్ పర్యటనకు వెళ్లనున్నారు. పాట్నాకు చేరుకునే నేతల ప్రక్రియ కూడా మొదలైంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయంగా ఊహాగానాలు కూడా వస్తున్నాయి. మొత్తానికి వేగంగా మారుతున్న రాజకీయ భేటీలు బీహార్‌లో ఏ మలుపు తిప్పుతాయో వేచి చూడాల్సిందే..!

# ఖమ్మంలో ఇంకా కన్నీళ్లే...

ఖమ్మం: ఖమ్మం నగరంలో ఎటు చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. వరదకు చెల్లాచెదురుగా మారిన బాధితుల కన్నీళ్లే తారసపడుతున్నాయి. ఇంకా ఖమ్మం నగరం జల దిగ్బంధంలోనే ఉంది. గోదారిలా ఉగ్ర రూపం చూపించిన మున్నేరు ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. 36 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి ప్రవహించిన మున్నేరు ఖమ్మం నడి బొడ్డున భయానక వాతావరణమే సృష్టించింది. వరద తాకిడికి ఇంకా అనేక ప్రాంతాలు ముంపులోనే ఉండిపోయాయి. వేలాది మంది కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. కొంచెం వరద తగ్గడంతో బురదలో కూరుకుపోయిన ఇండ్లను చూసి బాధితులు ఘొల్లుమంటున్నారు. విలువైన సామాన్లు కొట్టుకుపోయాయి. తిండి గింజలు, తాగునీరు కూడా లేకుండా వరద ముంచేయడంతో బాధితుల వేదన వర్ణనాతీతంగా మారింది. ఒకటో అంతస్తు వరకు నీళ్లు రావడంతో ఏం చేయాలో తెలియక కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశామని బాధితులు వాపోతున్నారు. ఖమ్మం నగరంలో మున్నేరు ఉగ్రరూపం దాల్చడంతో చుట్టూ ఉన్న రామన్నపేట నుంచి దానవాయిగూడెం, బ్రిడ్జి డౌన్, ఎఫ్సీఐ గోడౌన్, ఎంబీ గార్డెన్ పూర్తిగా మునిగిపోయాయి. నయా బజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద నీరు వచ్చి చేరింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపోయాయి. మోతీనగర్, బొక్కల గడ్డ, నయాబజార్, మంచికంటి నగర్, సుందరయ్య నగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్ కాల్వకట్ట, ధంసలాపురం నీట మునిగాయి. మూడో పట్టణానికి రంగనాయకుల గుట్ట పెట్టని గోడలా నిలిచింది. ఇదే లేకపోతే గాంధీ చౌక్ నుంచి మొదలకొని ముస్తఫానగర్ మీదుగా జరిగే ప్రమాదం ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి. రైల్వే ట్రాక్ దాటి రాపర్తి నగర్, కూరగాయల మార్కెట్ దాక వరద పోటెత్తింది. 30 ఏళ్ల కిందట వచ్చిన వరద కంటే ఇప్పుడు వచ్చిన వరద దారుణమని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సర్వం కోల్పోయామని బోరుమంటున్నారు. ముప్పై ఏళ్ల క్రితం బైపాస్ రోడ్డు మీదకు మాత్రమే నీళ్లు వచ్చాయి. కానీ తాజాగా మున్నేరు వరద ఖమ్మం చరిత్ర రికార్డ్ నే బ్రేక్ చేసింది. నయాబజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద వచ్చింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపో యాయి. మోతీనగర్, బొక్కలగడ్డ, నయాబజార్ వెనుక భాగం, మంచికంటి నగర్, సుందరయ్యనగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్, కాల్వకట్ట, దంసలాపురం కాలనీల్లో ఇండ్లు మొత్తం మునిగిపోయాయి. శనివారం రాత్రి అతి భారీ వర్షం కురిసింది. దీంతో ఆదివారం ఉదయం నుంచే మున్నేరుకు వరద ఉద్ధృతి మొదలైంది. నిమిషాల వ్యవధిలోనే వరద పెరుగుతున్న తీరును అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఫలితంగానే చుట్టుపక్కల కాలనీల ప్రజలు వరద బీభత్సానికి గురయ్యారు. మున్నేరు వరద రెప్పపాటున రావడంతో రెండు మూడు ఫ్లోర్లు బిల్డింగ్ ఉన్న వారు సైతం పైకి ఎక్కి ప్రాణాలు రక్షించుకున్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో అన్ని సామాన్లు తడిచి ముద్దయిపోయాయి. ప్రకాశ్ నగర్ లోని టింబర్ డిపోలు నీటిలో కొట్టుకుపోయి నేలమట్టమయ్యాయి. ప్రతి దుకాణంలోని టేకు కర్రలు, మిషన్లు నీటిలో మునిగి భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. మున్నేరు పరివాహక ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. 31వ డివిజన్ లో పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతంలో మున్నేటికి ఆనుకొని నిర్మించిన వెంచర్ లో ఇండ్లు కట్టుకున్న వారందరికీ వరద కన్నీటిని మిగిల్చింది. 15 అడుగులకు పైగా వరద రావడంతో ఇండ్లలోని సామాన్లు మొత్తం బురదలో చిక్కుకుపోయాయి. ఓ పాల వ్యాపారికి గేదెల మరణం తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇండ్లలో చేరిన వరదను తొలిగించుకునే పనిలో పడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఖమ్మం నగరంలో మున్నేరు ఉద్ధృతి కారణంగా చోటు చేసుకున్న వరద బీభత్స సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో ముగ్గురు మంత్రులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భట్టి విక్రమార్క కేవలం తన నియోజకవర్గమైన మధిరకే పరిమితమయ్యారు. పొంగులేటి, తుమ్మల మున్నేరు పరివాహక ప్రాంతంలో పర్యటించినప్పటికీ సరైన రీతిలో స్పందించి అధికారులను పరుగులు పెట్టించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రకాష్ నగర్ బ్రిడ్జ్ పై చిక్కుకుపోయిన తొమ్మిది మందిని కాపాడటంలో స్థానిక ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు విఫలమైన తీరుపై ప్రతిపక్షాలు సైతం మండిపడుతున్నాయి. సకాలంలో హెలికాప్టర్ ను తెప్పించి ఉంటే తుమ్మలకు క్రెడిట్ దక్కేది. ఒక సాధారణ జేసీబీ డ్రైవర్ సాహసం చేసి రాత్రి 10 గంటల సమయంలో తొమ్మిది మందిని కాపాడటంతో తుమ్మల సమర్థతపై మరిన్ని విమర్శలు గుప్పుమన్నాయి. గొప్ప సాహసం చేసిన ఆ డ్రైవర్ ను అభినందించడంలో కూడా అధికార పార్టీ ప్రతినిధులు విఫలమయ్యారు. ఆ డ్రైవర్ ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవి చంద్ర అభినందించడంతో స్థానిక మంత్రి తుమ్మల మరింత ఇరుకున పడ్డారు.

## ఇండోర్ స్టేడియం నిర్మాణానికి షబ్బీర్ అలీ శంకుస్థాపన

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో 8 ట్రాక్‌లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శంకుస్థాపన చేశారు.

ఒలంపిక్ స్థాయిలో శిక్షణ ఇచ్చిన ఘనత నిజామాబాద్‌కు ఉందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. అరకొర సదుపాయాలతో జిల్లా క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారని వెల్లడించారు. ఒలంపిక్ స్థాయి ప్రమాణాలతో క్రీడా అకాడమీ ఏర్పాటు చేసుకుందామని ఆయన స్పష్టం చేశారు. హాకీంపేటలో 200 ఎకరాల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని షబ్బీర్ అలీ తెలిపారు. గత ప్రభుత్వం క్రీడా మైదానాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకానికి పెట్టిందని ఆయన విమర్శించారు.

## జేసీబీ అన్న హ్యాట్సాఫ్...

### 9 మందిని కాపాడిన సుభాన్

ఖమ్మం: పోతే ఒక్కడ్నే.. వస్తే పది మంది.. ఇదేదో సినిమా డైలాగ్ అని అనుకోవద్దు. ఓ జేసీబీ డ్రైవర్ చేసిన సాహసం. వరద నీటిలో చిక్కుకున్న 9 మందిని.. జేసీబీ డ్రైవర్ సుభాన్ ధైర్యసాహసాలతో కాపాడాడు. ఇప్పుడు అతడు రియల్ హీరోగా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాడు. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందామా..

వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మంలో ప్రకాష్ నగర్ బ్రిడ్జి మీద వరదల్లో చిక్కుకున్న 9 మందిని ఒక్కడే వెళ్లి కాపాడాడు జేసీబీ డ్రైవర్ సుభాన్. అధికారులు, ఔఆఖీఈ సిబ్బంది, హెలికాప్టర్లు చేయలేని పనిని ఒక సామాన్యుడు.. అది కూడా జేసీబీ డ్రైవర్ ధైర్యంగా తన ప్రాణాలను పణంగా పెట్టి విపత్తులో ఉన్న 9 మందిని కాపాడాడు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వారిని కాపాడటానికి వెళ్లేముందు అతడు 'పోతే ఒక్కడిని పోతా.. వస్తే వాళ్లతో పదిమంది వస్తాం' అన్న మాటలు అందరికీ స్పూర్తినిస్తాయంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. చిమ్మ చీకట్లో కబళించే ఆ పెను వరద ముప్పులో పడి వెళ్లి.. ఆ 9 మంది ప్రాణాలకు దిక్కూచి అయ్యావంటూ అతడ్ని పొగడ్తలతో ముంచెత్తారు.

## సముద్ర తీరానికి 30 కిలోమీటర్ల రోడ్లకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలి



**– స్టెయిన్‌లెస్ స్టీల్ వాడి ఉంటే.. శివాజీ విగ్రహం కూలేది కాదు**

**– కంద్ర రోడ్డు, రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరీ**

ముంబై : సింధుదుర్గ్‌లో ఇటీవల 35 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ అంశం గురించి కేంద్ర రోడ్డు, రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఒకవేళ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఆ విగ్రహాన్ని నిర్మించి ఉంటే, అప్పుడు ఆ విగ్రహం కూలి ఉండేది కాదు అని ఆయన అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో రస్ట్ రెసిస్టెంట్ మెటీరియల్స్ వాడకం ముఖ్యమని ఆయన గుర్తు చేశారు. తుప్పు పట్టని ఇనుము వాడాలని సూచించారు. సముద్రానికి దగ్గరలో నిర్మిస్తున్న బ్రిడ్జ్‌లకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలని గత మూడేళ్ల నుంచి చెబుతున్నాని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో ముంబైలో 55 ఫ్లైఓవర్లు నిర్మాణ పనులను పర్యవేక్షించానని, ఐరన్ రాడ్లకు ఏదో ఒక పౌడర్ వేసి వాటిని రస్ట్ ప్రూఫ్‌గా చూపించారని, కానీ ఆ ఇనుము తుప్పు పట్టిందన్నారు. సముద్ర తీరానికి 30 కిలోమీటర్ల పరిధిలో ఉండే అన్ని రోడ్లకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలని సూచిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఇటీవల కూలిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేసి ఉంటే, అది కూలేది కాదు అని మంత్రి గడ్కరీ తెలిపారు. నేవీ డే సెలబ్రేషన్స్ సందర్భంగా 2023 డిసెంబర్ 4వ తేదీన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఓపెన్ చేశారు. అయితే ఆ విగ్రహం ఆగస్టు 26వ తేదీన కూలింది. ఈ ఘటనలో సింధుదుర్గ్ పోలీసులు శిల్పి జయదీప్ ఆప్టే గురించి లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అక్రమ, కబ్జా కట్టడాను తొలగించాలి

**– తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మ చక్రం సంస్థ అధ్యక్షురాలు యామినీ లక్ష్మి**

హైదరాబాద్: ప్రకృతి విలయ తాండవం.. వర్షం వరద వలయం లో మునిగిన రెండు తెలుగు రాష్ట్రాల కు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో అందరికీ తెలిసిన విషయమే. ఈ నేపద్యం లో ధర్మ చక్రం సంస్థ అధ్యక్షురాలు యామినీ లక్ష్మి స్పందించారు. త్వరగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అక్రమ, కబ్జా కట్టడాలని తొలగించి.. కనీసం వచ్చే సంవత్సరం వర్షాలు వచ్చే లోపల.. అన్నీ సరి దిద్ది బాగు చేయాలని కనీసం వచ్చే సంవత్సరం వర్షాలు వచ్చే లోపల.. అన్నీ సరి దిద్ది బాగు చేయాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు కావచ్చు, ఉన్న ప్రభుత్వాలు ఇప్పటికయినా కళ్ళు తెరచుకుని అక్రమణలకు, కబ్జాలకు గురైన చెరువులు, గుంటలు, వాగులు, వంకలని.. యధావిధిగా ఉండేలా చూడాలి.. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం లో హైడ్రా తో అక్రమ కట్టడాలను కూల్చివేయడం మొదలైన్ది.. ఇంకా ఎన్నో వున్నాయి.. ఈలోపు ప్రకృతి విపత్తు సంభవించడం.. బాధాకరమని.. అసలు కొండలు, గుట్టల్ని పిండి చేసి అక్రమంగా కట్టిన వాటిని, అడవులని నరికి కట్టిన కట్టడాలను వెంటనే కూల్చివేసి.. వాటి ధర్మాలని అవి అంటే ప్రకృతి ని నాశనం చేస్తే తిరిగి మనల్ని నాశనం చేస్తుంది..జంతువులు, ప్రకృతి వాటి ధర్మం అవి పాటిస్తున్నాయి.. కాని మనిషి వాటిని పాటించడంపాటించడం లేదని యామినీ లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**